
ఆంధ్రజ్యోతి




కర్నూలు
జిల్లా వార్తలు 5
శనివారం 25 జనవరి 2025

ఓటు వజ్రాయుధం

- నమోదుకు నిరంతరాయంగా అవకాశం
- 18 ఏళ్లు నిండిన వారంతా అర్హులే
- నేడు 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం

కర్నూలు కలెక్టరేట్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం. ప్రతి వ్యక్తి ఓటరుగా నమోదు చేసుకోవడం వల్ల నచ్చిన నాయకుడిని ఎన్నుకోవడానికి అవకాశం ఉంటుంది. ఓటు హక్కు వినియోగించుకోకపోతే ప్రజాస్వామ్యానికి చేటు చేసినట్లు అవుతుంది. అర్హులందరూ ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవడమే గాక స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఏటా జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అర్హులైన పౌరులందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం నిరంతరాయంగా కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, గుర్తింపు కార్డుల పంపిణీ చేపడుతోంది. జిల్లాలో అర్బన్ పోలింగ్ స్టేషన్స్ 698, రూరల్ పోలింగ్ స్టేషన్స్ 1505 ఉన్నాయి.

జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య
20,62,569





ఈ నెల ఆరో తేదీ నాటికి ఓటర్ల జాబితా ప్రకారం వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
137-కర్నూలు	258	1,32,658	1,41,869	26	2,74,553
138-పాణ్యం	355	1,61,799	1,70,969	74	3,32,842
142-పత్తికొండ	257	1,11,922	1,12,430	22	2,24,374
143-కోడుమూరు (ఎస్సీ)	275	1,23,768	1,23,691	16	2,47,475
144-ఎమ్మిగనూరు	271	1,22,570	1,26,273	45	2,48,888
145-మంత్రాలయం	237	1,02,763	1,06,754	25	2,09,542
146-ఆదోని	256	1,30,961	1,33,669	52	2,64,682
147-ఆలూరు	294	1,30,633	1,29,528	52	2,60,213
మొత్తం	2,203	10,17,074	10,45,183	312	20,62,569

- 18 నుంచి 19 సంవత్సరాల వారు 27,927 మంది ఉన్నారు.
- 20 నుంచి 29 సంవత్సరాల వారు 4,17,189 మంది
- 30 నుంచి 39 సంవత్సరాల వారు 5,65,297 మంది
- 40 నుంచి 49 సంవత్సరాల వారు 4,52,744 మంది
- 50 నుంచి 59 సంవత్సరాల వారు 3,07,413 మంది
- 60 నుంచి 69 సంవత్సరాల వారు 1,78,059 మంది
- 70 నుంచి 79 సంవత్సరాల వారు 86,734 మంది
- 80 సంవత్సరాలపైబడిన 27,206 మంది ఓటర్లు ఉన్నారు.
- విభిన్న ప్రతిభావంతులు పురుషులు 13,724 మంది, స్త్రీలు 10,180, థర్డ్‌జెండర్ ఓటర్లు నలుగురు నమోదయ్యారు.

గీత కార్మికులకు మద్యం దుకాణాలు

- 27న నోటిఫికేషన్, 5 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- వచ్చే నెల 7న డిప్ తీయనున్న కలెక్టర్



డిప్ తీస్తున్న జాయింట్ కలెక్టర్

కర్నూలు అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గీత కులస్థులకు మద్యం దుకాణాలు కేటాయించారు. డిప్ ద్వారా జాయింట్ కలెక్టర్ బీ. నవ్య ఖరారు చేశారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ చాంబర్లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం. సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలోని గీత ఉప కులాలకు దుకాణాలను జనాభా, దుకాణాల ప్రాతిపదికల మీద 10 శాతం దుకాణాలను డిప్ ద్వారా ఎంపిక చేశారు. ఈడిగ-6, గౌడ్-3, గౌడ-1 చొప్పున దుకాణాలను కేటాయించారు. వీటికి ఈనెల 27 నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. 5వ వరకు దరఖాస్తుల స్వీకరణ, ఫిబ్రవరి 7న కలెక్టర్ డిప్ ద్వారా దుకాణాలను ఎంపిక చేసి లబ్ధిదారులకు కేటాయించనున్నారు. 50 శాతం రాయితీతో మాత్రమే దుకాణాలకు లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈడిగ కులాల్లో ఆదోని మున్సిపాలిటీ, ఆదోని రూరల్, మద్దికెర, కోసిగి, చిప్పగిరి, ఆస్పరి, గౌడ్‌లకు కర్నూలు కార్పొరేషన్, క్రిష్ణగిరి, కౌతాళం, గౌడ కులస్థులకు ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో దుకాణాలను కేటాయించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సీఐలు రాజేంద్ర ప్రసాద్, చంద్రహాస పాల్గొన్నారు.

ప్రతి ఊళ్లో ఆదర్శ పాఠశాల

పాఠశాలల కమిషనర్ విజయరామరాజు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేస్తున్నట్లు పాఠశాలల విద్యా కమిషనర్ విజయరామరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో కర్నూలు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో జీవో నెం.117 ఉపసంహరణ, అనంతరం పరిణామాలు, ప్రత్యామ్నాయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల కేంద్రంగా అమలవుతున్న విద్యావిధానాలు క్షేత్రస్థాయిలో ఆచరణాత్మకంగా సత్ఫలితాలు సాధించాలని తెలిపారు. అలాగే పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విద్యాశాఖ అధికారులకు పాఠశాలల ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. పాఠశాల విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా విద్యాశాఖ చర్యలు తీసుకుంటున్నదని కమిషనర్ వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో విద్యాశాఖకు ప్రభుత్వం రూ.24వేల కోట్ల బడ్జెట్ కేటాయించిందన్నారు. 45వేల ప్రభుత్వ పాఠశాలల్లో 1.88 లక్షల ఉపాధ్యాయులు పని చేస్తున్నారని, 35 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని ఆయన వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను ఏ విధంగా బలోపేతం చేయాలనే అంశంపై అధికారులు, ఉపాధ్యాయులు సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా, నంద్యాల కలెక్టర్ రాజకుమారి, కర్నూలు జేసీ డా.బి. నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, నంద్యాల విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి, మండల స్పెషల్ అధికారులు, ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, క్లస్టర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.





డ్రోన్ హబ్ స్థలాల పరిశీలన

- ఓర్వకల్లులో 300 ఎకరాలు అనుకూలం
- ప్రత్యేక విమానంలో వచ్చి పరిశీలించిన డ్రోన్ కార్పొరేషన్ డైరెక్టర్లు



అధికారులతో మాట్లాడుతున్న డ్రోన్ కార్పొరేషన్ డైరెక్టర్లు

ఓర్వకల్లు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపల్లె, పాలకొలనులో డ్రోన్ హబ్ స్థలాలను పరిశీలించేందుకు చెన్నై, ఢిల్లీ నుంచి డైరెక్టర్లు ప్రత్యేక విమానంలో శుక్రవారం ఓర్వకల్లు చేరుకున్నారు. రవీంద్ర కుమార్, మనోజ్ కార్గ్, సీఎం పాండే బృందానికి తహసీల్దార్ విద్యాసాగర్, మండల సర్వేయర్ శంకర్ మాణిక్యం ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్ స్వాగతం పలికారు. డైరెక్టర్లు ప్రత్యేక వాహనంలో చింతలపల్లె, పాలకొలను స్థలాలను పరిశీలించారు. ఓర్వకల్లులోని 300 ఎకరాల్లో డ్రోన్ హబ్ ఏర్పాటు కు భూములు అనుకూలంగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ భూమి 484 సర్వే నెంబరులో 600 ఎకరాల భూమి ఉందని, అందులో 400 ఎకరాలు భూములు అనువుగా ఉన్నాయని అధికారులు వారికి తెలిపారు. రెండు గ్రామాల మధ్య అధికారులతో కలిసి డైరెక్టర్లు మ్యాప్‌ను పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్నామని అన్నారు. రూ.1000 కోట్ల పెట్టుబడులతో డ్రోన్ పాలసీ-2024-2029 ఏపీ డ్రోన్ కార్పొరేషన్ రూపొందించిందన్నారు. డ్రోన్ రంగంలో 40వేల ఉద్యోగాల కల్పన రూ.3వేల కోట్ల రాబడి లక్ష్యంగా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. అనంతరం వారు ఈ ప్రదేశంలో రోడ్లు, విద్యుత్, వాటర్, తదితర మౌలిక వసతుల ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పాల వెంకటేశ్వర్లు, ఏపీఐఐసీ సర్వేయర్ చెన్నయ్య, సైట్ ఇంజనీర్ సందీప్ కుమార్, చింతలపల్లి గ్రామ సర్పంచ్ వెంకటరమణ, టీడీపీ సీనియర్ నాయకులు చదువుల సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా తగ్గిన పత్తి ధర

గరిష్ఠంగా రూ.7,509



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం పత్తి ధర స్వల్పంగా తగ్గింది. పత్తి ధర గరిష్ఠంగా క్వింటాలు రూ.7509 పలికింది. గత వారం మద్దతు ధరకు మించి క్వింటానికి రూ.150 అధికంగా పలకడంతో రైతులు సంతోషపడ్డారు. అంతలోనే పత్తి ధర క్వింటానికి రూ.100 పైగా ధర పతనం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో పత్తి గింజల ధరలు తగ్గడం వల్ల స్థానిక మార్కెట్‌లో పత్తి ధరపై ప్రభావం చూపిందని కాటన్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. 2,969 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ట ధర రూ.4,808, గరిష్ట ధర రూ.7,509 మధ్య ధర రూ.7,309 పలికింది.

కందుల కొనుగోళ్లు ప్రారంభం

- కర్నూలులో 26, నంద్యాలలో 28 కేంద్రాలు
- క్వింటం మద్దతు ధర రూ.7,550

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ అధికారులు ఎప్పుడెప్పుడు మద్దతు ధరకు కందులు కొంటారా? అని రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లాలో 9వేల మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాలో 8వేల మెట్రిక్ టన్నుల కందులు మద్దతు ధరకు కొనేందుకు మార్క్‌ఫెడ్ అధికారులు చర్యలు చేపట్టారు. గురు, శుక్రవారాల్లో రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల ద్వారా కేంద్రం నిర్ణయించిన క్వింటానికి రూ.7,550 ప్రకారం కొనడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కర్నూలు మార్క్‌ఫెడ్ డీఎం రాజు మాట్లాడుతూ రైతులు దళారులకు, వ్యాపారులకు తమ పంట ఉత్పత్తులు తక్కువ ధరకు అమ్మి నష్టపోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతుల నుంచి పూర్తి స్థాయిలో ప్రభుత్వం అనుమతించిన మేరకు కందులను కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. గోనె సంచులను ప్రభుత్వమే సమకూరుస్తున్నదని, రైతులు ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు. ఏమైనా అక్రమాలకు పాల్పడితే కేంద్రాల సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఆదోనిలో కందుల కొనుగోళ్లను ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ అధికారులు

చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలు

- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- చోద్యం చూస్తున్న అధికారులు



చేపల చెరువుకు తరలిస్తున్న కోళ్ల వ్యర్థాలు

గడివేముల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సాధించాలన్న ఉద్దేశంతో చేపల చెరువుల యజమానులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కుళ్లిన కోడిగుడ్లు, కోడి పేగులు, ఈకలు, కుళ్లిన మాంసం చేపలకు ఆహారంగా వేస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతోపాటు పర్యావరణానికి ముంపు వాటిల్లుతున్నా అధికారులు మామూళ్ల మత్తులో ఈ చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని గడిగరేవుల, తిరుపాడు, కొరటమద్ది గ్రామాల్లోని కొందరు రైతులు తమ పొలాల మట్టిని గోరుకల్లు రిజర్వాయర్ నిర్మాణానికి విక్రయించారు. పొలాల్లో మట్టిని తవ్వగా ఏర్పడిన భారీ గుంతల్లో కొందరు ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపల సాగు చేపట్టారు. చేపలకు మేతగా వేరుశనగ చెత్త, తవుడు, సోయాబిన్‌మిలెడ్‌లను వాడాల్సి ఉంది. సంప్రదాయ మేతను వేయడం వల్ల నెలకు ఎకరాకు రూ.25 వేల మేర ఖర్చు అవుతుంది. ఈ ఖర్చును తగ్గించుకునేందుకు కొందరు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేపలకు కోళ్ల వ్యర్థాలను మేతగా వేస్తున్నారు. పట్టపగలే ఆటోలు, వ్యాన్‌లలో కోళ్ల వ్యర్థాలను నంద్యాల, గడివేముల నుంచి చేపల చెరువులకు తరలిస్తున్నారు.

చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలు

సాధారణ మేత వల్ల చేపలు నెలకు అర కేజీ నుంచి కేజీ పెరిగితే, కోళ్ల వ్యర్థాలు తిన్న చేపలు మరింత బరువు పెరుగుతున్నాయి. సాధారణ మేతతో పోలిస్తే కోళ్ల వ్యర్థాలు తక్కువ ధరకు వస్తుండటంతో కొందరు చేపల చెరువుల యజమానులు వీటినే వినియోగిస్తున్నారు. నంద్యాల పట్టణంలోని చికెన్ షాపుల నుంచి వ్యర్థాలను సేకరించి గొర్రెల సంత వద్ద నిల్వ ఉంచుతున్నారు. అక్కడి నుంచి డ్రమ్ములలో చికెన్ వ్యర్థాలను తీసుకొని భారీ వాహనాల ద్వారా చేపల చెరువు వద్దకు చేరవేస్తున్నారు. పట్టపగలే కోళ్ల వ్యర్థాల రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోక పోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి.



చేపల చెరువులో కోళ్ల వ్యర్థాలు

చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలు వేస్తే చర్యలు

చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలను వేయడం చట్టరీత్యా నేరం. గడిగరేవుల చేపల చెరువులలో కోళ్ల వ్యర్థాలను వేస్తున్నారన్న సమాచారం మా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ చేపడుతున్నాం.
- ఏవీ రాఘవరెడ్డి, జాయింట్ డైరెక్టర్, మత్స్యశాఖ, నంద్యాల

నోటీసులు జారీ చేశాం

కోళ్ల వ్యర్థాలతో చేపలు సాగు చేయడం చట్టరీత్యా నేరం. గడిగరేవుల చేపల చెరువుల యజమానులకు నోటీసులు జారీ చేశాం. కోళ్ల వ్యర్థాలను వేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.
-వెంకటరమణ, తహసీల్దార్, గడివేముల

నిబంధనలు ఇలా..

కోళ్ల వ్యర్థాలు చేపలకు మేతగా వేయడాన్ని నిషేధిస్తూ 2016లో ప్రభుత్వం జీవో నంబర్ 56ను జారీ చేసింది. ఈ జీవోను అమలు చేసేందుకు మండల స్థాయిలో తహసీల్దార్, మత్స్య అభివృద్ధి అధికారి (ఎఫ్‌డీవో), ఎస్ఐ, వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లతో, టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. పట్టుబడిన వ్యర్థాలను నాశనం చేయడంతోపాటు డ్రైవర్ లైసెన్స్ రద్దు, వ్యర్థాలతో సాగు చేస్తున్న చేపల చెరువుల రిజిస్ట్రేషన్ రద్దు వంటి చర్యలను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అమలు చేయాల్సి ఉంది. అయితే మండలంలో చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

9 ఏఎస్ఐలకు పదోన్నతి



కర్నూలు క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ రేంజ్ పరిధిలోని ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన తొమ్మిది మంది ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి కల్పించారు. వీరంతా 1991 బ్యాచ్‌కు చెందిన వారు. పదోన్నతి పొందిన ఏఎస్ఐలు శుక్రవారం రాత్రి కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ దారుణ హత్య

- ఉద్యోగానికి రాజీనామా చేయాలంటూ టీడీపీ నేతల ఒత్తిళ్లు
- పలుమార్లు బెదిరించారని మృతుడి భార్య, మామ ఆరోపణలు





సంఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య, పోలీసులు ఇన్‌సెట్లో మృతుడు

వివరాలు 7వ పేజీలో

సెస్సు వసూళ్లలో లక్ష్యం అధిగమించాలి

జేడీ రామాంజనేయులు



మాట్లాడుతున్న జేడీ రామాంజనేయులు

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించిన సెస్సు లక్ష్యాన్ని సాధించాలని, లేకపోతే చర్యలు తప్పవని మార్కెట్ కమిటీల సెక్రటరీలు, సిబ్బందిని కడప మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు హెచ్చరించారు. శుక్రవారం మార్కెట్ యార్డులోని ఏడీఎం కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాలోని 15 మార్కెట్ కమిటీల సెక్రటరీలతో వివిధ అంశాలపై కడప నుంచి వచ్చిన జేడీ దిశా నిర్దేశం చేశారు. దళారులు, వ్యాపారుల అక్రమాలను నిరోధించాలని, దీని వల్ల సెస్సు ఆదాయం పెరగడంతో పాటు రైతులకు నష్టం జరగదని, ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చూపినా వేటు తప్పదని జేడీ స్పష్టం చేశారు. పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు జరుగుతున్న కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ మార్కెట్ కమిటీల సెక్రటరీలతో రైతుల ఇబ్బందులపై పూర్తి శ్రద్ధ తీసుకుని పరిష్కరించాలన్నారు. తూకం కాటాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, అవి సక్రమంగా పని చేస్తున్నదీ లేనిదీ నిఘా పెట్టాలని అన్నారు. నిబంధనల మేరకు రైతుల నుంచి చార్జీలు మాత్రమే వసూలు చేయాలని ఇతరత్రా అధికంగా వసూలు చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్న పెంచికలపాడు సీసీఐ కేంద్రంపై నిత్యం అధికారులు నిఘా పెట్టాలన్నారు. అక్కడ దళారులకు, వ్యాపారులకు ఏ మాత్రం అవకాశం లేకుండా రైతులు నేరుగా సీసీఐ కేంద్రానికే పత్తి అమ్మేలా అవసరమైన వసతులు కల్పించాలన్నారు. చెక్ పోస్టులను గట్టి బందోబస్తుతో నిఘా పెట్టాలని జీరో వ్యాపారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి, కోడుమూరు సెక్రటరీ సుందర్‌రాజు, పాణ్యం సెక్రటరీ రెహిమాన్, పత్తికొండ సెక్రటరీ కార్నలీస్, ఏడీఎంలు నారాయణమూర్తి, రహిమాన్ పాల్గొన్నారు.

ప్రగతి బాటలో పాడి పరిశ్రమ



వ్యవసాయం తరువాత అన్నదాతకు వెన్నుదన్నుగా నిలిచే పాడి పరిశ్రమకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పాల ఉత్పత్తి పెంచడం, పశు పోషణపై ఆధారపడి జీవిస్తున్న పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ముందు చూపుతో వ్యవహరిస్తున్నాయి. పాడి రైతులు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా పశు కిసాన్ క్రెడిట్ కార్డులను అందుబాటులోకి తీసుకవచ్చి అండగా నిలుస్తున్నాయి. పాడి పరిశ్రమ ప్రగతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా పశు వైద్య శిబిరాలను ప్రారంభించింది. ఈ నెల 31 వరకు పశువైద్య శిబిరాలు కొనసాగనున్నాయి.

పీకేసీసీ కార్డు పొందడానికి ఉండాల్సిన అర్హతలు

ఆవులు, లేదా గేదెలు కలిగిన పాడి రైతులైతే 2 నుంచి 9 వరకు పశువులు కలిగి ఉండాలి. అదే గొర్రెలు, మేకలు కలిగి ఉన్న రైతులు 20 నుండి 30 వరకు సంఖ్య ఉండాలి. పశువులు ఉన్నట్లు స్థానిక పశు వైద్యశాలలో ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలి. రైతు పీఎం కిసాన్ లబ్ధిదారుడై ఉండాలి. బ్యాంకు పాసు పుస్తకం, ఆధార్ పత్రం, పశువుల ధ్రువీకరణ కార్డుతో రైతు సేవా కేంద్రాలు, పశు వైద్యశాలల్లో సంప్రదించాలి.



కొలిమిగుండ్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటరు కార్డు, పాన్ కార్డు, కిసాన్ క్రెడిట్ కార్డు తరచూ మనకు వినిపించే గుర్తింపు కార్డులు. అయితే పశువులకూ ఓ గుర్తింపు కార్డు ఇచ్చి, అది పశు పోషకులకు ఉపయోగపడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయి. పశువుల పేరుపై పశు పోషకులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు అందిస్తున్నారు. మనిషి కుటుంబ, వ్యక్తిగత అవసరాలకు డబ్బు అవసరమైతే బంగారం, ఆస్తులు చూపి బ్యాంకులు, ప్రైవేటు సంస్థల వద్ద రుణం పొందుతారు. అలాగే పశు పోషణ కోసం డబ్బులు అవసరమైతే పాడి రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా ఈ పీకేసీసీ (పశు కిసాన్ క్రెడిట్ కార్డు) ద్వారా బ్యాంకుల నుంచి ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.10 వేల నుంచి గరిష్ఠంగా రూ.3 లక్షలకు వరకు రుణం పొందే అవకాశం కల్పించారు. తీసుకున్న రుణం 40 రోజుల్లో చెల్లిస్తే రైతుల నుంచి ఎలాంటి వడ్డీ వసూలు చేయరు. ఏడు శాతం వడ్డీతో రుణాలు అందిస్తుండగా, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చెరో మూడు శాతం వడ్డీ చెల్లించే విధంగా వెసులుబాటు కల్పించాయి. 40రోజుల తర్వాత రుణం చెల్లించే రైతులు కేవలం ఒక శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. పాల విక్రయాలతో వచ్చే నగదును జమ చేస్తూ సాధారణ క్రెడిట్ కార్డులా దీన్ని వినియోగించవచ్చు.

నంద్యాల జిల్లాలో పశువులు

ఆవులు - 1.20 లక్షలు, గేదెలు - 2.93 లక్షలు
మేకలు - 3.10 లక్షలు, గొర్రెలు - 8.82 లక్షలు

నంద్యాల జిల్లాలో పశు సంవర్ధక శాఖ లక్ష్యానికి మించి పీకేసీసీ కార్డులు పంపిణీ చేసింది. జిల్లాలోని బనగానపల్లె, పాణ్యం, నంద్యాల, ఆళ్లగడ్డ, శ్రీశైలం, నందికొట్కూరు డివిజన్‌లకు సంబంధించి 7200 పశు కిసాన్ కార్డులు పంపిణీ చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యం కాగా, అధికారులు ఇప్పటికే 9386 కార్డులు రైతులకు పంపిణీ చేశారు. జిల్లాలో పాడి పరిశ్రమ ప్రోత్సాహానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడే అవకాశం ఉన్నట్లు అధికారులతోపాటు, పాడి పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

- రైతులకు వరం పశు కిసాన్ క్రెడిట్ కార్డు
- జిల్లాలో లక్ష్యానికి మించి కార్డుల పంపిణీ
- పశువైద్య శిబిరాలతో విస్తృత సేవలు



పాడి రైతులకు ఇది మంచి అవకాశం

పశు పోషణకు రుణ సదుపాయం కల్పించడం అభినందనీయం. ప్రతి రైతూ ఉపయోగించుకోవాలి. 40 రోజుల్లో చెల్లిస్తే రైతుల నుంచి ఎలాంటి వడ్డీ వసూలు చేయరు. ఏడు శాతం వడ్డీతో రుణాలు అందిస్తుండగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చెరో 3శాతం వడ్డీ చెల్లించే విధంగా వెసులుబాటు కల్పించారు. 40 రోజుల తర్వాత రుణం చెల్లించే రైతులు కేవలం ఒక శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. పాల విక్రయాలతో వచ్చే నగదును జమ చేస్తూ సాధారణ క్రెడిట్ కార్డులా దీన్ని వినియోగించవచ్చు.

- శ్రీరాముడు, రైతు

రాజ్ భవన్‌కు మహానంది మోడల్ స్కూల్ విద్యార్థిని

మరోసారి మోడల్ స్కూల్‌కు అరుదైన గౌరవం



గీతవాణి

మహానంది, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం ఎం. తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గీతావాణికి జనవరి 26 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అట్ హోమ్ కార్యక్రమానికి విజయవాడలోని రాజ్ భవన్‌కు రావాలని ఆహ్వానం అందింది. పాఠశాల ప్రిన్సిపాల్ కె. లక్ష్మణ్‌రావు శుక్రవారం మాట్లాడుతూ గవర్నర్ జాయింట్ సెక్రటరీ పేరున ఆహ్వానం అందినట్లు తెలిపారు. రాష్ట్రంలో అవకాశం పొందిన ఏడుగురు విద్యార్థుల్లో మహానంది ఏపీ మోడల్ స్కూల్ మహానంది నుండి విద్యార్థిని గీతావాణికి ఆహ్వానం రావడం గర్వకారణం అన్నారు. ఈ ఎంపిక పట్ల మోడల్ స్కూల్ సంయుక్త సంచాలకురాలు తాహెర్ సుల్తానా, జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

మహానందిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు

- దిగ్విజయంగా నిర్వహిస్తాం
- ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి

మహానంది, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మహానందిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను ఫిబ్రవరి 22 నుండి మార్చి 1 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 22 న స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలు మహానంది నుండి నంద్యాల పట్టణానికి బయలు దేరుతాయన్నారు. తిరిగి 23 వ తేది నంద్యాల పట్టణంలో ఉత్సవమూర్తుల ఊరేగింపు తర్వాత రాత్రికి మహానందికి చేరుతాయని చెప్పారు. 24 న ఉదయం ప్రధాన ఆలయాల్లో పూజలయ్యాక సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహణం ఉంటుందని అన్నారు. 25 వతేది ఉదయం సూర్య ప్రభ వాహనం, సాయంత్రం సింహవాహన సేవ, 26 వ తేది ఉదయం రావణ వాహన సేవ, సాయంత్రం నంది వాహన సేవ, రాత్రి 10 గంటల నుండి లింగోద్భవ కాలంలో మహా రుద్రాభిషేకం, తెల్లవారుజామున 3 గంటల నుండి స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం ఉంటాయని అన్నారు. అలాగే 27 వతేది ఉదయం శేష వాహన సేవ, సాయంత్రం పుష్ప పల్లకి సేవ, 28 ఉదయం అశ్వ వాహన సేవ, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. మార్చి 1 న ఉదయం త్రిశూల స్నానం, ధ్వజా అవరోహణం, సాయంత్రం తెప్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈవో తెలిపారు. బ్రహ్మోత్సవాల రోజుల్లో ప్రధాన ఆలయాల్లో భక్తులకు అన్ని సేవలను నిలిపి వేశామని, రుద్రగుండం కోనేరులో పుణ్య స్నానాలను రద్దు చేశామని తెలిపారు. శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎర్రమల్ల మధు, పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, దేవికారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరెడ్డి

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు టెండర్లు : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాటు పనులకు శుక్రవారం దేవస్థానం కార్యాలయంలో ఈవో శ్రీనివాసరెడ్డి సీల్ టెండర్ల ద్వారా బహిరంగ వేలాలు నిర్వహించారు. ఇందులో విద్యుత్ అలంకరణ, షామియానాలు, పార్కింగ్ స్థలంలో బారికేడ్ల ఏర్పాటు మొదలైన వాటికి సీల్ టెండర్ ప్రక్రియ ద్వారా తక్కువ కోడ్‌తో వేసిన కాంట్రాక్టర్లకు పనులను అప్పగించారు.

27న శ్రీకృష్ణదేవరాయల జయంతి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈనెల 27న ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయల జయంతిని ఘనంగా నిర్వహించాలని జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడు కోనేటి చంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని జిల్లా బలిజ సంఘం కార్యాలయంలో కోనేటి చంద్రబాబు మాట్లాడుతూ గత కొంత కాలంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి విషయంలో సందిగ్ధం నెలకొందని, దానిని నివృత్తి చేస్తూ ఇప్పుడు స్పష్టమైన ఆధారాలతో నిర్ణయం తీసుకున్నామన్నారు. గతంలో ఫిబ్రవరి 16 అని కొంత మంది, జనవరి 17న ఆయన జయంతిని జరపాలని మరి కొంత మంది వాదిస్తూ వచ్చారని, దీంతో జయంతి వేడుకలపై స్పష్టత కరువైందన్నారు. ఈ నేపథ్యంలో శ్రీకృష్ణదేవరాయల కుమార్తె మోహనాంగి రాసిన మరీచి పరిణయం అనే కావ్యంలో రాయలవారి జన్మదినం గురించి ప్రస్తావించిందన్నారు. వికృతి నామ సంవత్సరం, పుష్యమాసం, కృష్ణపక్షం, ద్వాదశి, శుక్రవారం రాయలవారు జన్మించారని మోహనాంగి పేర్కొన్నట్లు పోలిశెట్టి సత్తిరాయుడు సమాచారం సేకరించారని పేర్కొన్నారు. కావున శ్రీకృష్ణదేవరాయల జయంతి జరుపుకునే వారందరూ జనవరి 27న మాత్రమే ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

14వ రోజు 310 మంది ఎంపిక

దేహదారుఢ్య పరీక్షలను పర్యవేక్షించిన ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా



కర్నూలు క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు శుక్రవారం 14వ రోజు కొనసాగింది. స్థానిక ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలను ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 484 మంది బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు, 1600 మీటర్ల పరుగు పరీక్షలో 345 మంది అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగులో 215 మంది, లాంగ్‌జంప్‌లో 304 మంది, కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు 14వ రోజు 310 మంది అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో ఇన్ చార్జి ఎస్పీ, హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నత్త నడకన నగర పాలక భవనం



- నిలిచిపోయిన నిర్మాణ పనులు
- మూడు అంతస్తులకే పరిమితం
- రూ.28 కోట్లు ఖర్చు

కర్నూలు న్యూసిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ నూతన భవన నిర్మాణం ఆగిపోయింది. రూ.28 కోట్లతో 2022 సంవత్సరం ఆగస్టు 1న అప్పటి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, కమిషనర్, అధికారులు అట్టహాసంగా ప్రారంభించారు. అన్ని అత్యాధునిక టెక్నాలజీతో రెండు బ్లాక్‌ను నిర్మించేలా పనులు ప్రారంభించి 29 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ఇంకా మొదటి బ్లాక్ రెండు అంతస్తులు..రెండో బ్లాక్ ఒక్క అంతస్తు మాత్రమే నిర్మించారు. రెండు సంవత్సరాల్లో పనులు పూర్తి చేస్తారని కడపకు చెందిన ఓ బడా కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. మధ్యలో ఒక నెల ఎలాంటి పనులు చేయకుండా కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. అధికారులు తనకు సహకరించడం లేదని సదరు కాంట్రాక్టర్ ఆరోపిస్తున్నారు.

రూ.9.50 కోట్ల పుష్కర నిధులు

పుష్కర నిధుల్లో మిగిలిన రూ.9.50 కోట్లు నగరపాలక సంస్థ నూతన భవన నిర్మాణానికి ఉపయోగించాలనే తీర్మానాన్ని కౌన్సిల్‌లో ఆమోదించారు. మొత్తం రూ.28 కోట్ల అంచనాతో భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. మిగిలిన నిధులు ప్రభుత్వం, కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాలని తీర్మానించారు.

మరో బ్లాక్ ఆదిలోనే ఆగింది..

అయితే ఇప్పటికి కనీసం ఒక బ్లాక్ పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ క్రమంలో అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకురాకపోవడంతో ఇష్టానుసారంగా భవనాన్ని నిర్మిస్తున్నారు. మరో బ్లాక్ నిర్మాణానికి పునాదులు తీసి ఒక్క అంతస్తు మాత్రమే నిర్మిస్తున్నారు. అంతే కాకుండా ఇక్కడ ఆధునాతన భవన నిర్మాణం జరుగుతుండగానే ప్రస్తుతం ఉన్న కార్యాలయంలోని కొన్ని విభాగాల్లో అనవసరంగా మరమ్మతు చేసి ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారు. మారో బ్లాక్ నిర్మించాలనే ఉద్దేశంతో మేయర్‌ను కమిషనర్ రూమ్‌కు కేటాయించారు. కమిషనర్‌కు అడిషనల్ కమిషనర్ రూమ్ కేటాయించారు. అదే విధంగా స్టాండింగ్ కమిటీ రూమ్‌ను అడిషనల్ కమిషనర్‌కు కేటాయించారు. మొదటి బ్లాక్‌లో కనీసం అధికారులకు సంబంధించిన నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది. ప్రజాధనం దుర్వినియోగం చేయడంతో పాటు భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు.

చేసిన పనులకు బిల్లులు అప్‌లోడ్ చేసాము

నిర్మాణ పనుల బిల్లులు అప్‌లోడ్ చేసాం. సీఎఫ్ఎంఎస్ నుంచి బిల్లులు రావాల్సి ఉంది. నిర్మాణ పనులు జరుగుతూనే ఉన్నాయి. గతంలో పెండింగ్‌లో ఉండే బిల్లులు కూడ నేను జాయిన్ అయ్యాక ప్రభుత్వానికి పంపించాను. త్వరలోనే నిర్మాణ పనులు వేగవంతమవుతాయి.

-రాజశేఖర్, నగర పాలక సంస్థ ఎస్ఈ

రూ.7 కోట్ల పెండింగ్ బిల్లులు..ముందుకు రాని కాంట్రాక్టర్

నూతన భవనాన్ని నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌కు ఇప్పటి వరకు రూ.7 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం రూ.28 కోట్లు అంచనా. అయితే 2023 డిసెంబర్‌లో కాంట్రాక్టర్‌కు అప్పటి ప్రభుత్వంలో రూ.2 కోట్లు చెల్లించారు. అయితే 2024 సంవత్సరంలో ఒక్కపైసా కూడ చెల్లించలేదని కాంట్రాక్టర్ పనులు ఆపేసినట్లు తెలిసింది. అంతే కాకుండా నగర పాలక సంస్థ చెల్లించిన నిధులతో కేవలం గ్రౌండ్‌ఫ్లోర్‌కు సరిపోతుందని...కాంట్రాక్టర్ తన సొంత నిధులతో మొదటి బ్లాక్‌లోని రెండు అంతస్తులకు స్లాబ్ వేసినట్లు తెలిసింది. అంతే కాకుండా భవనాన్ని పర్యవేక్షిస్తున్న ముగ్గురు సూపర్‌వైజర్లకు గత ఏడు నెలలుగా జీతాలు కూడ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఇంతే..



కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలైనా ఒక్కపైసా కూడ బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. బిల్లులు త్వరితగతిన చెల్లిస్తే నిర్మాణం అనుకున్న సమయంలో పూర్తి చేసేందుకు ఆస్కారం ఉంటుంది. ఆ దిశగా ప్రజాప్రతినిధులు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

గతంలో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులకు ముడుపులు..?

ఇంత పెద్ద మొత్తంలో భవన నిర్మాణం జరుగుతుండటంతో గతంలో కొందరు అధికారులు, ఓ ప్రజాప్రతినిధికి కాంట్రాక్టర్ పెద్ద మొత్తంలో ముడుపులు చెల్లించినట్లు విశ్వసనీయ సమాచారం. అంతే కాకుండా కార్పొరేషన్‌లో అప్పటి కీలక అధికారి వద్ద సహాయకుడిగా పని చేస్తున్న ఓ ఉద్యోగికి కూడా ఆ కాంట్రాక్టర్ పెద్ద మొత్తం చెల్లించినట్లు సమాచారం. ఈ విషయం ఆ అధికారికి తెలిస్తే ఎక్కడ తన ఉద్యోగానికి ఎసరు వస్తుందోనని భయంతో ఆ ఉద్యోగి జాగ్రత్త వహించారు. కేవలం భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగేందుకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధికి ముడుపులు అందాయి. ఈ క్రమంలోనే ఇప్పటి వరకు భవన నిర్మాణంపై అధికారులు, ప్రజాప్రతినిధి ఒక్కసారిగా కూడా అటువైపు చూడలేదు.



కళాకారులను ఆదుకోవాలి

ఏపీ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్

కర్నూలు న్యూసిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కళాకారులకు రూ.6 వేలు పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్ కోరారు. కర్నూలులోని సీఆర్ భవన్‌లో శుక్రవారం సిసీ డైరెక్టర్ బాబ్జితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేలాది మంది కళాకారులు ప్రభుత్వ ఆదరణ లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేవారు. కళాకారులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. కళలను ప్రోత్సహించడంతో పాటు కళాకారులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పెంచలయ్య, ఆర్గనైజింగ్ కార్యవర్గసభ్యులు రామారావు, జిల్లా కార్యదర్శి నాగరాజు, నంద్యాల జిల్లా కార్యదర్శి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కొండా మనోహర్



కర్నూలు లీగల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సీబీఐ కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కొండా మనోహర్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి శుక్రవారం ఆయనకు ఉత్తర్వులు అందాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు సంబంధించిన సీబీఐ కేసులను ఈయన వాదిస్తారు. ఈయన ఈ పదవిలో మూడు సంవత్సరాలు కొనసాగుతారు. 1994లో ఆయన ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసి న్యాయవాద వృత్తిని చేపట్టారు. ఆయన గతంలో కర్నూలు కోర్టులలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా సేవలందించారు. ఈయన నియామకం పట్ల సీనియర్ న్యాయవాదులు ఏ. రామసుబ్బారెడ్డి, ఎంఎల్. శ్రీనివాసరెడ్డి, ఎస్. చాంద్‌బాషా, వై. శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఆధునిక ప్రయోగశాల, జనిత స్కిల్ ల్యాబ్ ప్రారంభం



జనిత మోన్ స్కిల్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ విద్యార్థులకు ఆధునిక ప్రయోగశాల జనిత స్కిల్ ల్యాబ్ అని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కె. చిట్టినరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ కాలేజీ ఆఫ్ నర్సింగ్‌లో వారు జనిత మోన్ స్కిల్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ప్రతిష్టాత్మకమైన ఈ ల్యాబ్ విద్యార్థుల నాలెడ్జ్ యాండ్ స్కిల్ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్. మంజుల రాణి, వైస్ ప్రిన్సిపాల్ వి. ధనలక్ష్మి, కళాశాల ట్యూటర్స్ శోభారాణి, శాంతిభవాని, మంజుల, సరళ కుమారి పాల్గొన్నారు.

డిగ్రీ 5వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలో 5వ సెమిస్టర్ ఫలితాలను ఉపకులపతి, ప్రొఫెసర్ డీవీఆర్ సాయి గోపాల్ విడుదల చేశారు. 214 మంది పరీక్షలు రాయగా 206 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 96 శాతం ఉత్తీర్ణత సాధించారని రీ వాల్యూయేషన్ కోసం కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, పరీక్షల విభాగం డీన్ కే. నాగరాజు శెట్టి, పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ కే. బాలకృష్ణయ్య శెట్టి పాల్గొన్నారు.

బీఈడీ 3వ సెమిస్టర్...

కర్నూలు అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ 3వ సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. 697 మంది పరీక్షలు రాయగా 306 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్ సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

ఆదోని రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆదోని-ఆస్పరి బైపాస్ లోని విరుపాపురం సమీపంలో జరిగే రోడ్డు ప్రమాదంలో ఆకుల నాగరాజు(45) మృతి చెందాడు. తాలూకా ఎస్ఐ రామాంజనేయులు వివరాల మేరకు.. గూడూరు మండలం రేమట గ్రామానికి చెందిన నాగరాజు బంధువులతో కలిసి శుక్రవారం దహన సంస్కారాల కోసం విరుపాపురం వచ్చారు. రాత్రి 8గంటల సమయంలో ఆటోలో తిరిగి సొంత గ్రామానికి బయలుదేరారు. గ్రామ శివార్లలో ముందుగా వెళ్తున్న స్కూటర్‌ను అధిగమించే క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

డెంగీ కేసు నమోదు

వెల్దుర్తి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి డా.బీఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న రాణి జ్వరం రావడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సూదేపల్లె గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, మేరీలు వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యపరీక్షలు నిర్వహించగా డెంగీ జ్వరం నిర్ధారణ అయింది. విద్యార్థిని కోలుకుంటుందని ఆరోగ్యంగానే ఉందని వైద్యులు వెల్లడించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ దారుణ హత్య

- ఉద్యోగానికి రాజీనామా చేయాలంటూ టీడీపీ నేతల ఒత్తిళ్లు
- పలుమార్లు బెదిరించారని మృతుడి భార్య, మామ ఆరోపణలు



బండారి ఈరన్న (ఫైల్)

ఆలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు మండలంలో ఓ ఫీల్డ్ అసిస్టెంట్ శుక్రవారం దారుణ హత్యకు గురయ్యాడు. ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం విషయంలో నెలకొన్న వివాదాలే హత్యకు కారణమయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఆలూరు మండలం అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా బండారి ఈరన్న(50) ఐదేళ్లుగా పని చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్థానిక నాయకులు ఈరన్నను ఉద్యోగం వదిలేయాలంటూ ఒత్తిడి తెచ్చారు. ఇదే విషయంపై గ్రామంలో పలుమార్లు పంచాయితీలు కూడా జరిగాయి. ఈ క్రమంలో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు ఉద్యోగాన్ని వదిలేయాలంటూ ఈరన్నపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తెచ్చారు. రాజీనామా చేయకపోతే అంతు చూస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఎంత చెప్పినా ఉద్యోగాన్ని వదిలేయకపోవడంతో స్థానికంగా ఉన్న కొందరు నాయకులు బండారి ఈరన్నపై కక్ష పెంచుకున్నారు. చివరకు శుక్రవారం ఉదయం 11 గంటలకు విధులకు బైక్‌పై వెళ్తున్న ఆయనను వెంబడించి కత్తులతో దాడి చేశారు. హత్య చేసిన అనంతరం పరారయ్యారు. విషయం తెలుసుకున్న పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆలూరు సీఐ వెంకట చలపతి, ఎస్ఐ దిలీప్ కుమార్, క్లూజ్ టీంతోపాటు డాగ్ స్క్వాడ్‌తో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిసర ప్రాంతాలను పరిశీలించారు. హత్యకు గల కారణాలను భార్య, బంధువులు, గ్రామస్థుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా మృతుడికి భార్య నాగలక్ష్మితోపాటు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య నాగలక్ష్మి, మామ మల్లయ్యలు మాత్రం ఈరన్న హత్యకు టీడీపీ నాయకులుగా ఉన్న మంగళి గోపి, రామదాసు, గాదెలింగ, గోవర్ధన్ కారణమని ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం వదిలేయకపోతే హత్య చేస్తామంటూ బెదిరించారని, చివరకు అన్నంత పని చేశారని బోరున విలపించారు. ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, ఆయన కుమారుడు గిరీష్ గౌడ్ హత్య చేసిన వారికి అండగా నిలిచారని ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

హత్యా రాజకీయాలు సరికాదు : ఎమ్మెల్యే విరూపాక్షి

కూటమి ప్రభుత్వం ఇలాంటి హత్యా రాజకీయాలకు పాల్పడటం సరైన విధానం కాదని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్ బండారి ఈరన్న హత్యకు గురి కావడంతో ఎమ్మెల్యే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఉద్యోగం కోసం కూటమి ప్రభుత్వం ఇలాంటి హత్యా రాజకీయాలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని, డిప్యూటీ సీఎం పవన్, హోం మంత్రి అనిత ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

హత్యకు కారకులైన వారిని వదిలిపెట్టం

ఆలూరు మండలం అరికెర గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ బండారి ఈరన్నను హత్య చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య అన్నారు. శుక్రవారం రాత్రి ఆలూరు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగ విషయంలో ఇరువురి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయని, ఆ వివాదం వల్లే ఈ హత్య జరిగి ఉండవచ్చని అన్నారు. హత్య సంఘటనపై క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు ద్వారా విచారిస్తున్నారు. మృతుడి భార్య నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన కొందరిపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య, పోలీసులు



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



బండారి ఈరన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

హక్కుల రక్షణకు ప్రత్యేక చట్టాలు

- జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి

కర్నూల లీగల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హక్కుల రక్షణకు పలు చట్టాలు ఉన్నాయని, వాటి ద్వారా బాలబాలికలు, అసంఘటిత కార్మికులు, మహిళలు తమ హక్కులను కాపాడుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది సూచించారు. స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాలలో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల న్యాయ సేవా పథకం, బాలల పరిరక్షణ పథకం, బాలికల సాధికారత పథకం వంటి ఎన్నో పథకాలు ఉన్నాయని, వాటి ద్వారా లబ్ధి పొందవచ్చని ఆయన తెలిపారు. బాల బాలికలు తమ హక్కులను తెలుసుకుంటే సమాజంలో అన్యాయాలకు గురి కాకుండా ఎదుర్కోడానికి వీలుంటుందని తెలిపారు. న్యాయ సహాయం అవసరమైన వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే వారికి ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని తెలిపారు. మహిళలకు కోర్టులలో ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ కరణం కిషోర్ కుమార్, క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డీవీఆర్ సాయిగోపాల్, చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివ, డీసీపీవో శారద, జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు నజీమ కౌసర్, క్లస్టర్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత చైల్డ్ వెల్ఫేర్ శాఖ, కార్మిక శాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన సందర్శించారు.

- **కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ:** నగరంలోని పలువురు కార్మికులకు గుర్తింపు కార్డులను, అసంఘటిత కార్మికులకు ఈశ్రమ్ కార్డులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి పంపిణీ చేశారు. ఇంకా దరఖాస్తు చేసుకోనివారు కార్మిక శాఖ అధికారులను సంప్రదిస్తే వారికి కూడా కార్డులను అందజేస్తామని ఆయన తెలిపారు.

తాటి చెట్టును ఢీకొన్న టెంపో వాహనం

- ఐదుగురికి తీవ్ర గాయాలు
- డ్రైవర్ నిద్ర మత్తు వల్లే ప్రమాదం



తాటి చెట్టుకు ఢీకొని నుజ్జునుజ్జయిన వాహనం

ఆదోని రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : తాటి చెట్టును టెంపో వాహనం ఢీకొనడంతో మైసూరుకు చెందిన ఐదుగురు యాత్రికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. డ్రైవర్ నిద్ర మత్తు కారణంగానే ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. బాధితులు, పెద్ద తుంబళం పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం మైసూరుకు చెందిన గురురాజా కుటుంబ సభ్యులు మొత్తం 13 మంది టెంపో వాహనంలో మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై గురువారం బయల్దేరారు. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో ఆదోని మండలం పెద్దతుంబళం సమీపంలోకి రాగానే వేగంలో ఉన్న వీరి వాహనం ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న తాటి చెట్టును ఢీకొట్టింది. దీంతో వాహనం ముందు భాగం నుజ్జు నుజ్జు కావడంతోపాటు డ్రైవర్, ముందు సీటులో కూర్చున్న వారు ఇరుక్కుపోయారు. క్షతగాత్రుల ఆర్తనాదాలు విన్న చుట్టు పక్కల పొలాల్లో వారు ప్రమాద స్థలానికి చేరుకొని వాహనంలో ఉన్న వారందరినీ బయటకు తీశారు. వీరిలో డ్రైవర్ సంతోష్, గిరిధర్, శాంతి, సుజాత, ప్రజ్ఞలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు రాయచూరుకు తరలించారు. గురురాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిధర్



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శాంతి, డ్రైవర్ సంతోష్

డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నాడు: శాంతి

ఒక రోజంతా వాహనం నడిపిన డ్రైవర్ నిద్ర మత్తులో ఉన్నందు వల్ల ప్రమాదం చోటు చేసుకుంది. విశ్రాంతి తీసుకోమని ఎన్ని సార్లు చెప్పినా డ్రైవర్ వినలేదు. ఆదోనిలో మాత్రమే కొద్దిసేపు నిద్రపోయాడు.

వేగంగా నడపొద్దు అన్నాం: గిరిధర్

మేము ప్రయాణిస్తున్న ఈ వాహనం మైసూరు నుంచి ప్రమాద స్థలం వరకు డ్రైవర్ వేగంగానే నడిపాడు. నిదానంగా వెళ్లమని చెప్పినా వినలేదు. అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఏ హానీ జరగలేదు. ఆ రాఘవేంద్ర స్వామి మా ప్రాణాలను రక్షించాడు.

నమో నారసింహా..



ఆలమూరులో పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు

రుద్రవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నమో నారసింహా... అంటూ పార్వేట ఉత్సవ పల్లకీలో కొలువు దీరిన జ్వాలా లక్ష్మీనరసింహస్వామితో, ప్రహ్లాద వరద స్వామి ఉత్సవమూర్తులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం మండలంలోని ఆలమూరు గ్రామంలో పూజలు రెండో రోజు అందుకున్నారు. అహోబిళ క్షేత్రం నుంచి మకర సంక్రాంతి రోజున పార్వేట పల్లకీ ప్రారంభమైన విషయం విదితమే. కాగా, రుద్రవరం మండలం ఆలమూరు గ్రామంలో తిరుణాల ఏర్పాటు చేశారు. అంగళ్లల్లో రంగురంగుల బొమ్మలు, మట్టిగాజులు, ఇతర సామగ్రి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. దీంతో గ్రామంలో సందడి నెలకొంది.

ఆలమూరులో బండలాగుడు పోటీలు : మండలంలోని ఆలమూరు గ్రామంలో శుక్రవారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ బండలాగుడు పోటీల్లో ఐదు జతల ఎడ్లు పాల్గొన్నాయి. తిరుణాల సందర్భంగా ఈ పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. బండలాగుడు పోటీల్లో గెలుపొందిన ఎద్దులకు జగన్‌రెడ్డి అనే వ్యక్తి నగదు బహుమతులను ప్రదానం చేశారు.

భూమి విలువపై ఫైనల్ సర్వే




సర్వే చేస్తున్న అధికారులు

పాణ్యం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే మార్గ నిర్మాణ స్థలం కోసం చేపట్టిన స్థల పరిహారంపై భూములను ఫైనల్ సర్వే చేసినట్లు పాణ్యం తహసీల్దారు నరేంద్రనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం పాణ్యం పరిధిలో గోపీకృష్ణారావుకు చెందిన 28 సెంట్ల భూమిని అటవీ, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉద్యానవన శాఖల అధికారులు సర్వే నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ రైల్వే మార్గానికి చేపట్టే స్థలంలో ప్రభుత్వ రహదారి ఉండడంతో స్థలాన్ని రైల్వే మార్గానికి ఏర్పాటు చేసి రహదారికి రైతుల భూములు కేటాయించడానికి అవసరమైన సర్వే నిర్వహించినట్లు తెలిపారు. అలాగే ఈ భూముల్లోని చెట్లు, పైపు లైనులు తదితర నిర్మాణాలకు పరిహారాన్ని నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటికే రైల్వే మార్గానికి అవసరమైన 98 సెంట్లు స్థలం సర్వే పూర్తి చేసినట్లు తెలి పారు. ఈ సర్వేతో కొలూరు, నెరవాడ గ్రామాలకు రహదారితోపాటు వంద ఎకరాలకు రహదారి ఏర్పాటవుతుందన్నారు. అటవీశాఖ డీఆర్వో విజయ లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుశేఖర్, ఉద్యానవన శాఖ అధికారి దివ్య, వీఆర్వో టీరేంద్ర, సర్వేయర్ లవకుమార్, ప్రశాంత్, కలాం పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఎస్ఈగా ద్వారకనాథ్ రెడ్డి

కర్నూలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈగా ద్వారకనాథ్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎఫ్‌పీసీ ఎస్ఈ బాలచంద్రా రెడ్డి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 17న జలవనరుల శాఖలో ఈఈలకు ఎస్ఈ పదోన్నతి ఇస్తూ బదిలీలు చేపట్టింది. అందులో భాగంగా కడప జిల్లా తెలుగుగంగ ప్రాజెక్టు డీఎస్ఈగా పని చేస్తున్న ద్వారకనాథ్ రెడ్డికి ఎస్ఈగా పదోన్నతి ఇస్తూ కర్నూలు ఎస్ఈగా బదిలీ చేసింది. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎస్ఈగా కొనసాగుతున్న బి. బాలచంద్రారెడ్డి అదే కార్యాలయంలో డీఎస్ఈగా కొనసాగుతారు. కర్నూలు ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన ద్వారకనాథ్ రెడ్డి స్వస్థలం అనంతపురం. ఆయన అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల్లో ఎక్కువ కాలం పని చేశారు. తొలిసారిగా కర్నూలుకు బదిలీపై వచ్చారు. ఏప్రిల్ నెలలో ఆయన రిటైర్ అవుతారు. అంటే ఈ పదవిలో మూడు నెలలు మాత్రమే కొనసాగే అవకాశం ఉంది. ఎస్ఈ ద్వారకనాథ్ రెడ్డిని పలువురు ఇంజనీర్లు, కార్యాలయ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. అనంతరం ఆయన ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ కబీర్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు.



బాధ్యతలు చేపట్టిన ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ ద్వారకనాథ్ రెడ్డి



సీఈ కబీర్ బాషాను కలిసిన ఎస్ఈ ద్వారకానాథ్ రెడ్డి

ఓటు హక్కు విలువైనది

మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కె. చిట్టినరసమ్మ

కర్నూలు హాస్పిటల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు ఎంతో విలువైనదని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని ఓటు హక్కుపై వైద్య విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలన్నారు. కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓటు అన్నది ప్రజల ప్రాథమిక హక్కు. అని ఎలాంటి ప్రభుత్వం ఉండాలి..ఎలాంటి నాయకులను ఎన్నుకోవాలి అన్నది ఓటరు నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. అరుణ, అసోసియేట్ ప్రొఫెసర్ డా. సోమశేఖర్ పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: ఓటు విలువ తెలుసుకుని..యువత భవితను మలచుకోవాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. ఈ నెల 25న ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగర పాలక కార్యాలయంలో కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర పాలక కమిషనర్ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటు మాత్రమే అన్నారు. కార్యక్రమంలో అర్బన్ తహసీల్దారు వెంకటలక్ష్మి, అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, డిప్యూటీ తహసీల్దారు ధనుంజయ, అకౌంట్స్ ఆఫీసర్ చుండీప్రసాద్, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

● జిల్లా పరిషత్ పరిపాలన భవనంలో ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారులు సి.మురళీమోహన్‌రెడ్డి, జితేంద్ర, నాగేంద్ర ప్రసాద్, నాగరాజు, పుల్లయ్య, సరస్వతమ్మ, బసవశేఖర్ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఓర్వకల్లులోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని అధికారులతో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమణయ్య, ఏపీవో కుమారసాయినాథ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోడుమూరు: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక సంత మార్కెట్ నుంచి పాత మీదుగా కొత్తబస్టాండ్ వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ రాలీలో కేవీఆర్, కేపీఎన్ఆర్ కళాశాల విద్యార్థులు పాల్గొనానరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు కోసం మీ పేరు నమోదు కోసం గ్రామ, వార్డు పరిధిలోని బూత్‌స్థాయి అధికారులు సంప్రందించవచ్చు అన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం, మీ సేవ కేంద్రంలో కూడా పేర్లు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాముడు, డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు, వీఆర్వో ఎల్లప్ప, పరమేష్, టీడీపీ నాయకులు గోపాల్‌నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ గోట్ల శేఖర్ రెవెన్యూ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సి.బెళగల్: జాతీయ ఓటరు దినోత్సవంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం అవరణలో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో రాణెమ్మ, సూపరింటెండ్ శ్రీనివాసులు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ పురుషోత్తం మాట్లాడుతూ ఓటు వజ్రాయుధమన్నారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.


ఓర్వకల్లులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో, అధికారులు


సి.బెళగల్‌లో..


అధికారులు, వైద్య విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్


మున్సిపల్ కార్యాలయంలో..



కోడుమూరులో ర్యాలీ చేస్తున్న అధికారులు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి


పాఠశాలల విద్యాశాఖ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పాఠశాలల విద్యాశాఖ కమిషనర్ విజయరామ రాజుకు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎస్.గోకారి, డివిజినల్ సెక్రటరీ తిమ్మప్ప, ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హృదయరాజు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జీవో 117 రద్దు అనంతరం నూతనంగా ఏర్పాటు చేయబోయే పాఠశాలల నిర్మాణం, ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన సమస్యలను పాఠశాలల విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఫ్యాప్టో సభ్య సంఘాలు నాయకులు టీకే జనార్దన్, యూఆర్ఏ రవికుమార్, నవీన్ పాటి, శ్రీనివాస్ యాదవ్, వై.నారాయణ, ఇస్మాయిల్ ఉన్నారు.

బాలికలకు అవగాహన కల్పించండి

కర్నూలు హాస్పిటల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలికలకు మంచి స్పర్శ (గుడ్ టచ్) చెడు స్పర్శ (బ్యాడ్ టచ్)ల గురించి అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ తెలిపారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలోని తన చాంబరులో రాష్ట్రీయ కిశోర స్వాస్థ్య కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన బాల్యవివాహాలు, వ్యక్తిగత పరిశుభ్రత పోస్టర్లను డీఎంహెచ్‌వో విడుదల చేశారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలలోపు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శైలేష్ కుమార్, డెమో శ్రీనివాసుల శెట్టి, పీసీపీఎన్‌డీటీ కన్సల్టెంట్ సుమలత, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, ఆర్‌బీఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున, డీఈవో మల్లేశ్వరి, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో కౌన్సెలింగ్ జరగాలి


డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న హంస నాయకులు

కర్నూలు హాస్పిటల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య శాఖ పరిధిలో హెల్త్ అసిస్టెంట్లు రీ డిప్లాయిమెంట్ కౌన్సెలింగ్‌ను ఉమ్మడి జిల్లా ప్రకారం నిర్వహించాలని ఏపీ హంస నాయకులు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళకు వినతి పత్రం సమర్పించారు. సీనియారిటీ లిస్టును సవరించాలని, ఉద్యోగులను దృష్టిలో ఉంచుకుని ట్రైబల్ వారికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు బి.రఘుబాబు, సిటీ అధ్యక్షుడు టి.గోవిందస్వామి, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంటు వెంకటస్వామి, జిల్లా నాయకులు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

సి.బెళగల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో రాణెమ్మ ఆర్‌డబ్ల్యూఎస్ అధికా రులకు, సర్పంచులకు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో గురువారం సర్పంచులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో ఏపీవో రామన్న పాల్గొన్నారు.

అంతర్ పంటలను సాగు చేసుకోవాలి

సి.బెళగల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల్లో అంతర్ పంటలను సాగు చేసుకోవాలని కోడుమూరు ఉద్యానవనశాఖ అధికారి మధు సూదన్‌గౌడు రైతులకు సూచించారు. మండలంలోని పోలకల్లు, బ్రాహ్మ ణదొడ్డి, మారందొడ్డి, ఇనగండ్ల గ్రామాల్లోని రైతులతో సమావేశమయ్యారు. హార్టికల్చర్ అసిస్టెం ట్లు చెంచురాజు, నాగన్న, నాయక్, భరత్‌కుమార్ ఊర్మిళ, అఫ్రీన్, రైతులు పాల్గొన్నారు.

పరిటాలకు నివాళి

కర్నూలు అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో బడుగు, బలహీన వర్గాల కోసం పరిటాల రవి కృషి చేశారని అని జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు వి.హనుమంతరావు చౌదరి అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పరిటాల రవి వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా పరిటాల రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కందుల కొనుగోళ్లకు డీసీఎంఎస్ కేంద్రాలు

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో డీసీఎంఎస్ కేంద్రాల్లో రైతుల నుంచి కందుల కొనుగోళ్లు చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నట్లు డీసీఎంఎస్ అధికారి రాజు తెలిపారు. శుక్రవారం కర్నూలు నగరంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కర్నూలు, కల్లూరు, గూడూరు మండలాల్లో రైతుల నుంచి కందులు కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, రైతులు సంబంధిత కేంద్రాల సిబ్బందిని సంప్రదించి అమ్మకాలు చేయవచ్చని స్పష్టం చేశారు. కర్నూలు మండలానికి సంబంధించి డీసీఎంఎస్ అధికారి సంతోష్‌ను 9381085983, కల్లూరు మండలానికి ఎస్.వలి 9177637605, గూడూరు మండలానికి వెంకటేష్ అధికారి 901007 3455 నెంబర్లను సంప్రదించాలన్నారు.

కంటి జబ్బులపై అప్రమత్తంగా ఉండాలి

ఓర్వకల్లు జనవరి 24(ఆంధ్రజ్యోతి): కంటి జబ్బులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం ఓర్వకల్లు పంచాయతీ కార్యాల యంలో శాంతిరాం మెడికల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, అయా బ్‌బాషా, యాసీన్ బాషా పాల్గొన్నారు.

ఈశ్రమ్ కార్డుల పంపిణీ


ఈశ్రమ్ కార్డులను పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు హాస్పిటల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు ఈశ్రమ్ కార్డులు ఎంతో ఉపయోగపడు తాయని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమాచార భవనంలో జర్నలిస్టులకు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు శ్రీలక్ష్మి, కేశన్నలతో కలిసి ఆయన కార్డులను పంపిణీ చేశారు.

ధాన్యం కొనుగోలుకు పచ్చజెండా

జేడీ వ్యాపారులతో అత్యవసర సమావేశం

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్‌గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి చర్యలు చేపట్టారు. మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు శుక్రవారం కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయంలో రైసుమిల్లుల యజమానులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలుకు ఎంపిక చేసిన మాధవాచారి ప్లాట్‌ఫారం సముదాయాన్ని పరిశీలించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్, అకౌంటెంట్ కిషన్ రెడ్డి పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం

గూడూరు, జనవరి 24:(ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం గూడూరు మండలం చనుగొండ్లలో రీ సర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్ రామాంజనేయులు పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యాక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్వర రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొ న్నారు.

సి.బెళగల్: రీసర్వేకు రైతులు సహకరించాలని, లేకుంటే కొలతలు నిలిపేస్తామని తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పురుషోత్తం మాట్లాడుతూ మండల కేంద్రంలో సోమవారం నుంచి రీసర్వే చేపడుతు న్నార న్నారు. ఈ సమావేశంలో మండల సర్వేయర్ నాగభూషణం, సర్పంచ్ పాండురంగన్న, వీఆర్వోలు పాల్గొన్నారు.

రూ.లక్ష కోట్లు కేటాయించాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాగన్న

ఓర్వకల్లు జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి నిధులకు రూ.లక్ష కోట్లు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఓర్వకల్లులో ఉపాధి పనులను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు పెంచాల్సిందిపోయి తగ్గించడం సరైంది కాదన్నారు. రోజు కూలికి రూ.300 మాత్రమే ఉందని, అది కూడా కూలిలకు సరిపోవడం లేదన్నారు. అలాగే పనుల వద్ద గుడారాలు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలు, కూలీలు పాల్గొన్నారు.

మా స్థలం ఇప్పించండి మహాప్రభో..

కర్నూలు న్యూసిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని బంగారుపేటకు చెందిన స్థలాన్ని నగర పాలక సంస్థ బలవంతంగా తీసుకుందని..తమ స్థలాన్ని తక్షణమే ఇప్పించండి మహాప్రభో అంటూ బాధితులు నీలి శికారి సుగుణ, శికారి జిల్లి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నగర పాలక కార్యాలయంలో ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ జలమండలి కార్యాలయం నుంచి ఆనంద్ థియేటర్ వరకు కేసీ కెనాల్ వెంట రోడ్డు వేయాలని గతంలో అధికారులు ప్రతిపాదించారన్నారు. అయితే తమకు సంబంధించిన 54 సెంట్ల స్థలాన్ని లాక్కుని ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా రోడ్డు వేయమేమిటని ప్రశ్నించారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పోలీసులతో తమను బలవంతంగా కొట్టిస్తున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకెళ్లిన ఎవ్వరు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.


నిరసన తెలుపుతున్న నీలి శికారిలు

విహారయాత్రలా..దావోస్ యాత్ర: ఎస్వీ

కర్నూలు న్యూసిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తండ్రీకొడుకుల దావోస్ పర్యటన పెట్టుబడులు సాధించే యాత్రలా కాకుండా విహార యాత్రల సాగిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎస్వీ కాంప్లెక్స్ సమావేశం భవనంలో మేయర్ బీవై. రామయ్య, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకువచ్చి ఏపీని సస్యశ్యామలంగా చేస్తామని ఊదరగొట్టి అక్కడికి వెళ్లి ఉట్టి చేతులతో తిరిగివచ్చారని విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతీయ మెడికల్ కౌన్సిల్‌ను ఒప్పించి 14 మెడికల్ కాలేజీలను స్థాపిస్తే అందులో ఐదు కాలేజీలు ప్రారంభమైనాయన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

మెగా డీఎస్సీ ఏమైంది ?: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

కర్నూలు న్యూసిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో భాగంగా నిరుద్యోగులకు ఇస్తానన్న మెగా డీఎస్సీ ఏమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా నిరుద్యోగ భృతి ఇవ్వకుండా వారిని మోసం చేస్తుందన్నారు. ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు శ్రీకాకుళంలో జరిగే ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలకు యువత అధికసంఖ్యలో తరలిరావాలని అన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుమంచి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

హోంగార్డు సస్పెన్షన్

కర్నూలు క్రైం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన హోంగార్డు ఫిరోజ్‌ను సస్పెండ్ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల కింద కొత్తబస్టాండు సమీపంలో డ్యూటీలో ఉన్న హోంగార్డు ఫిరోజ్ ద్విచక్ర వాహనదారుడిపై దురుసుగా ప్రవర్తించాడు. అతని గొంతు పట్టుకుని లాగే ప్రయత్నం చేశాడు. సమీపంలో ఉన్న మరో వ్యక్తి తన సెల్ ఫోన్‌లో వీడియో చిత్రీకరించి సోషల్ మీడియలో అప్‌లోడు చేశాడు. ఈ ఘటనపై పలు వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో వైరలైంది. ఈ ఘటనతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించి సస్పెండ్ చేసినట్లు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయాలి

కర్నూలు అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు నుంచి ఉల్చాల వరకు రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర కోరారు. శుక్రవారం ఆర్ అండ్‌బీ ఈఈ సిద్దారెడ్డిని మండల కార్యదర్శులు సురేష్, ప్రకాష్‌లతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రేమట మీదుగా కొత్తకోట, మంత్రాలయం వరకు ప్రతి రోజు వందలాది వాహనాలు ప్రయాణం చేస్తున్నాయని, రోడ్డుకు ఇరువైపులా మట్టి లేకపోవడంతో..పెరిగిన వాహనాల రద్దీకి ఇప్పు డున్న సింగిల్ రోడ్డు ఏమాత్రం సరిపోవడం లేదని తెలిపారు. గురువారం ఉల్చాల గ్రామానికి చెందిన ఓ మహిళా ప్రమాదంలో మరణించగా, ఆరుగురు తీవ్రగాయాలతో బయట పడ్డారన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వెంకాయపల్లె లోని జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధ నలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీవో భరత్ శావన్ మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. త్రిబుల్ రైడింగ్‌కు చేయవద్దని, హెల్మెట్ ధరించాలని సూచించారు. తాలుకా ఎస్ఐ, మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్లు, ప్రొఫెసర్స్ శశికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

కర్నూలు అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ బాలుర కళాశాలలో మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి మాట్లాడుతూ సమాజంలో బాలికలు, మహిళలపై జరుగుతున్న శిశు, భ్రూణ హత్యలు, బాల్య వివాహాలు, వరకట్నహత్యలు, అత్యాచారాలను పౌర సమాజం, ప్రభుత్వాలు కలిసి కట్టుగా నియంత్రించాలని అన్నారు. మహిళా సాధికారిత విభాగం సభ్యు రాలు వి.నాగరత్నమ్మ మాట్లాడుతూ విద్య, ఉపాధి రంగాల్లో బాలికలకు అవకాశాలను పెంచాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జే.హేమంత్, ఎం.సత్యనారాయణ, మురళీధర్, శశికళ, మీనాక్షి, సుజాత, హేమలత పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో రాణించాలి

కర్నూలు అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధి కోర్సుల్లో రాణించాలని ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. శుక్రవారం నగరంలోని సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కళాశాలలో రాజ్‌కుమార్ ఫౌండేషన్ ద్వారా బ్యూటీషియన్ కోర్సు శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. నిర్వాహకురాలు రత్న కుమారి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ఎస్ నాగస్వామి నాయక్, సెయింట్ జోసెఫ్స్ కళాశాల ప్రిన్సిపాల్ శాంత పాల్గొన్నారు.

జీఎన్ఎం ప్రాక్టికల్స్‌లో విద్యార్థులే ఇన్విజిలేటర్లు

కర్నూలు హాస్పిటల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల జీఎన్ఎం నర్సింగ్ విద్యార్థుల ల్యాబ్ ప్రాక్టికల్స్‌ను 3వ సంవత్సరం విద్యార్థులే ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తున్నారని ఏపీ నర్సింగ్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ నాయుడు అన్నారు. ప్రాక్టికల్స్ పరీక్షల పేరుతో ఒక్కొక్క విద్యార్థి నుంచి అదనంగా రూ.1000 నుంచి రూ.1,500 అధిక ఫీజు వసూలు చేస్తున్నారని, దీనిపై కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ విచారణ జరిపించాలని ఆయన కోరారు.

దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


కుంటలో గంబూసియా చేపలు వదులుతున్న వైద్య సిబ్బంది

కోడుమూరు రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి భాస్కర్ ప్రజలకు సూచించారు. శుక్రవారం మండలంలోని అమడగుంట్ల గ్రామంలోని కుంటలలో గంబూసియా చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దోమలతో మలేరియా, డెంగీ, చికున్ గున్యా వంటి జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. దోమలబారి నుంచి రక్షణకు దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసయాదవ్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలం అరికేరలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బండారి ఈరన్నను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీ కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు గుడిసె శివన్న, కర్నూలు జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి శుక్రవారం డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు చేయించేందుకు వెళ్తుండగా.. వేట కొడవళ్లతో గుర్తు తెలియని దుండగులు అతికిరాతకంగా హత్య చేసినట్లు తెలిపారు. హత్యకు పాల్పడిన నిందితులను అరెస్టు చేయాలని జిల్లా కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దపాడు ధనుంజయ, శంకర్, తౌడు శ్రీనివాసులు, రామకృష్ణ డిమాండ్ చేశారు.

కర్నూలు న్యూసిటీ: ఆలూరు మండలం అరికేర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ బండారి ఈరన్నను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను దారుణంగా హత్యచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు భద్రత కల్పించాలి: ఫీల్డ్ అసిస్టెంట్లకు భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎండీ అంజిబాబు ఒక ప్రకటనలో కోరారు. ఆరికేర ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నపై దాడి చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ నిర్ణయం సరికాదు

కర్నూలు న్యూసిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్, వాహనాల ఫిట్నెస్ టెస్టులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరి కాదని, దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ ఆటో ట్రాలీ అండ్ డ్రైవర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి మహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ సంస్థలు ఏర్పాటు చేస్తున్న సెన్సార్ ఫిట్నెస్ ట్రాకులను వెంటనే నిలిపివేయాలన్నారు. సమావేశంలో అధ్యక్షుడు రవికుమార్, నాయకులు డి. కుమార్ పాల్గొన్నారు.

● హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని హమాలీ ఫెడరేషన్ కన్వీనర్ నాగస్వాములు డిమాండ్ చేశారు. సుర్జీత్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాలా మంది నిరుద్యో గులు పనులు లేక కుటుంబపోషణ కోసం లోడింగ్, అన్‌లోడింగ్‌లో బరువైన మూటలను ఎత్తి దించుతున్నారన్నారు. బరువులు ఎత్తే సమయంలో కాళ్లు, చేతులు ఇరగడంతోపాటు వెన్నుముక సమస్యలు వస్తున్నాయన్నారు. సమావేశంలో సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌దేశాయ్, విజయ్, రాంబాబు పాల్గొన్నారు.

విలేకరి మృతికి సీపీఐ సంతాపం

కర్నూలు న్యూసిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ పత్రికలో పని చేస్తూ మృతి చెందిన సీనియర్ విలేకరి హనుమంతుకు సంతాపం ప్రకటిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కే.రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మృతితో మంచి జర్నలిస్టును కోల్పోయిందన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు.


విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

కర్నూలు కల్చరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బుధవారపేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్టీలు ప్లేట్లు పంపిణీ చేశారు. ఏపీ రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్‌జోన్స్ సంయుక్త ఆధ్వర్యంలో 120 మంది విద్యార్థులు ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు మురారి శంకరప్ప, కార్యదర్శి ఎంఎల్ నరసయ్య, కోశాధికారి వెంకటస్వామి, ఉపాధ్యక్షుడు తిరుపతి సాయి, అర్బన్ అధ్యక్షుడు భీమయ్య గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కేజీ గంగాధరరెడ్డి, లయన్స్ క్లబ్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రియల్ ఎస్టేట్ వ్యాపారి రామకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు హేమలత పాల్గొన్నారు.


ప్లేట్లు అందుకున్న విద్యార్థులు

ఘాటు తగ్గిన మిర్చి





● క్వింటం రూ.12 వేలు

మద్దికెర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మిర్చి పంటను సాగు చేసిన రైతులకు కన్నీటి వేదన తప్పడం లేదు. ప్రతి ఏడాది మిర్చి రైతు ఏదో ఒక విధంగా నష్టపోతూనే ఉన్నారు. పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదు. మండలంలోని వ్యవసాయ బావులు, వ్యవసాయ తోటలు కాలువల కింద దాదాపు 500 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. రెండేళ్లుగా తెగుళ్ల కారణంగా మిర్చి దిగుబడి తగ్గుతోంది. ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు పడడంతో దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో ధరలు లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ప్రస్తుతం ఎండు మిర్చి క్వింటం రూ.10వేల నుంచి రూ.12వేలు పలుకుతుంది. అయినప్పటికీ రైతులు కల్లాల వద్దకు వచ్చి కొనుగోలు చేయడానికి వ్యాపారులు రావడం లేదు. గత ఏడాది రూ.25వేల నుంచి రూ.35వేల వరకు ధర పలికింది. ఉన్న ఫలంగా సగానికి సగం పడిపోయింది. దీనికి తోడు రైతుకు ఎకరాకు రూ.5వేల నుంచి రూ.6వేల వరకు కూలీల ఖర్చు అవుతుంది. ఎరువులు, పురుగు మందులు ధరలతో పెట్టుబడి పెరిగింది. ఇవన్నీ కలిస్తే రైతుకు ఎకరానికి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. ఈ ప్రాంతంలో ఎండుమిర్చిని నిలువ ఉంచుకోలేక గుంటూరు, హైదరాబాదు గోదాములకు తరలించి నిల్వ ఉంచుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పించకపోడంతోనే నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పంటను నిల్వ చేసుకునేందుకు గోదాములు, మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.



● మూడేళ్లుగా నష్టం వస్తూనే ఉంది



హంద్రీనీవా కాలువ కింద వ్యవసాయ తోటలో మిర్చి పంటను సాగు చేశామని, మొన్నటి వరకు ఆశాజనకంగా ఉన్నా ధరలు ఉన్న ఫలంగా రూ.10 నుంచి రూ.12వేలకు పడిపోవడంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది.

- రంగస్వామి, కొత్తపల్లి రైతు

● ధరలు పడిపోయాయి



ఎండుమిర్చి ధర క్వింటం రూ.30వేల నుంచి రూ10వేలకు పడిపోయింది. దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టాం. ఈ ఏడాది మొదటి నుంచి పంటకు తెగుళ్ల సోకడంతో పంట దిగుబడి కూడా అంతంత మాత్రమే వస్తుంది.

- కృష్ణ, మద్దికెర, రైతు

సీసీ రోడ్లు నాణ్యతతో నిర్మించాలి

పత్తికొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ తేరుబజార్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను నాణ్యతతో చేపట్టాలని డ్వామా పీడీ వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఉపాధి పనుల పరిశీలను వెళ్తున్న ఆయన ఎన్‌ఆర్‌ఈజీఎస్, గ్రామపంచాయతీ నిధులతో నిర్మిస్తున్న రహదారి పనులలో పరిశీలించారు. కాంట్రాక్టర్ దశరథ రామిరెడ్డికి సూచించారు. ఆయనతోపాటు పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

టీచర్లను రెగ్యులర్ చేయాలి

ఆదోని టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మసూదియా అరబిక్ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో దశాబ్దాలుగా పని చేస్తున్న టీచర్లనే రెగ్యులర్ చేయాలని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, మైనారిటీలకు చెందిన పేద మహిళా టీచర్‌లు గత చాలాకాలంగా విధులను నిర్వహిస్తున్నారని అన్నారు. షాహీ జామియా మసీదు పాలక మండలి పెద్దలు సౌదీ రవూఫ్ స్పందించి నిర్ణయం తీసుకోవాలన్నారు. పాతవారిని కాదని, కొత్తవారిని నియమిస్తే, ముఖ్యమంత్రికు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

వైసీపీ లీగల్ సెల్ అడ్వైజర్‌గా నాగరాజు

ఆదోని రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆదోని వైసీపీ లీగల్ సెల్ అడ్వైజర్‌గా మణెకుర్తి నాగరాజును ఆ పార్టీ నియమించింది. శుక్రవారం నాగరాజు మాట్లాడుతూ లీగల్ సెల్ అడ్వైజర్‌గా నియమించిన మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, మనోజ్ రెడ్డికి, ప్రదీప్ రెడ్డికి రుణపడి ఉంటానని, అలాగే పార్టీ అభివృద్ధి కోసం, నాయకులు, కార్యకర్తల కేసులను పరిష్కరించడం కోసం కృషి చేస్తానని అన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ఆదోని రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఆదోని తహసీల్దార్ శివరాముడు తెలిపారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సచివాలయ, హెల్త్ సిబ్బందితో ఐసీడీఎస్ ఆడిటోరియంలో సమావేశం నిర్వహించార కమిషనర్, తహసీల్దార్ మాట్లాడుతూ, పిల్లలు సమయానికి ఇంటికి వస్తున్నారా లేదా.. పరిశీలించాలన్నారు. కూతుళ్ల విషయంలో జాగ్రత్తగా ఉన్నట్లే కొడుకులను కూడా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ఉమామహేశ్వరి, డిప్యూటీ డిఎం అండ్‌హెచ్‌ఓ సత్యవతి దేవి, సీఆర్‌పీ మల్లికార్జున, రాజశేఖర్, జోనాథన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

ఆస్పరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు కోరారు. శుక్రవారం సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ సుంకర ఉమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. తగలగళ్లు, అటికల్లు సర్పంచులు ఆంజనేయ, లతాశ్రీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి మోటర్లకు మరమ్మతులు చేయించే తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరారు. సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఎంపీపీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గీతావాణి, ఎంపీటీసీ నరసప్ప, రమేష్ రెడ్డి, రామేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఏపీవోగా బాధ్యతలు చేపట్టిన రత్నం

దేవనకొండ,జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఏపీఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవోగా రత్నం బాధ్యతలు చేపట్టారు. పత్తికొండ క్లస్టర్ పరిధిలో ప్లాంటేషన్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న రత్నంకు మండల ఏపీవోగా ఇన్‌చార్జి బాధ్యతలు అధికారులు ఇచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న కృష్ణమూర్తి ఆదోనికి బదీలిపై వెళ్లారు.

కందులు కొంటాం

మద్దికెర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు సాగు చేసి పండించిన కంది పంటను కొనుగోలు చేస్తామని వ్యవసాయ శాఖ మండల అధికారి యు. రవి తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మాట్లాడుతూ రైతులు ఎన్ని ఎకరాల్లో సాగు చేసినా రైతుల నుంచి 40 క్వింటాళ్ల వరకు మార్క్‌ఫెడ్ వారు కొనుగోలు చేస్తారని తెలిపారు. ప్రభుత్వం క్వింటం రూ.7,550లు ప్రకారం కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. రైతులు ఆదార్ కార్డు తీసుకుని సంబంధిత ఆర్‌బీకే కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 27 నుంచి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని తెలిపారు. దళారులు నమ్మి రైతులు మోసపోకుండా ప్రభుత్వానికే అమ్మాలని తెలిపారు. కేవలం 100 కేజీల మాత్రమే క్వింటాలుగా తీసుకుంటారని, ఎలాంటి తరుగు ఉండదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది జాకిర్ హుశేన్, ఆనంద్ నాయక్, రాణి, కవిత, తదితరులు ఉన్నారు.

పత్తికొండ: ప్రభుత్వం అందించే మద్దతు ధరకు కందులను విక్రయించే రైతులు రైతుసేవాకేంద్రాలలో తమపేరును రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని మండలవ్యవసాయాధికారి వెంకటరాముడు తెలిపారు. ప్రభుత్వం కందులు క్వింటానికి రూ7,550 కింద మద్దతు ధరను ప్రకటించిందని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తుగ్గలి: కందులకు మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగార్జున యాదవ్ కోరారు. శుక్రవారం జొన్నగిరిలో ఆయన మాట్లాడుతూ మండలంలో కందుల సాగు ఎక్కువ విస్తీర్ణంలో చేపట్టారని, క్వింటం రూ.9వేలు మద్దతు ధర చెల్లించాలని కోరారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు టీ వీరేష్

ఆదోని అగ్రికల్చర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షులు టీ వీరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జేబీ గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఆటోనగర్‌ను ఏర్పాటు చేసి కార్మికులకు పక్కా ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. 31న విజయవాడలో జరిగే ఆటో యూనియన్ 4వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఆటో స్టాండ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

ఆదోని అగ్రికల్చర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అండర్‌పేట పురపాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ బాలికలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలికలకు చదువు ఒక్కటే కాదని, వారిని స్వేచ్ఛా విహంగంలా ఎదగనిచ్చే సమాజం కావాలన్నారు. ఆడపిల్లలకు అండగా ఉండడంతో పాటు బాలికల విద్యా ప్రాముఖ్యత, వారి ఆరోగ్య పోషణపై అవగాహన కల్పించాలన్నారు. ఆడపిల్లలు చదువుకుంటే ఇంటికి వెలుగు అని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ షహనాజ్, డాక్టర్ రేణు శ్రీ, సూపర్‌వైజర్ ఇందిరా దోరతి, జ్ఞానేశ్వరి, మేరీ, జరీనా పాల్గొన్నారు.

కురువలపై కక్ష సాధింపు చర్యలు తగదు

- ఈరన్న హత్య చేసిన వారిని వదిలిపెట్టం
- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవేంద్ర



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవేంద్ర

ఆలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కురువలపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు తగవని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దేవేంద్ర, కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కురువ శశికళ కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో హత్యకు గురైన కురువ ఈరన్న మృతదేహాన్ని వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం కోసం అధికార పార్టీకి చెందిన నాయకులు ఇలా హత్య చేయించడం దారుణమన్నారు. కురువలపై ఇలాంటి హత్యా రాజకీయాలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. హత్యకు ప్రోత్సహించిన వారిని కూడా ముద్దాయిలుగా చేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ విషయంపై స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామాభివృద్ధికి కృషి చేస్తాం

● నాబార్డు రాష్ట్ర అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఖాలీద్ అన్సారీ



నాబార్డు కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఖాలీద్ అన్సారీ

మద్దికెర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మారుమూల గ్రామాల అభివృద్ధికి నాబార్డు కృషి చేస్తుందని రాష్ట్ర నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఖాలీద్ అన్సారీ అన్నారు. శుక్రవారం మద్దికెర గ్రామంలోని నాబార్డు నిధులతో నిర్మించిన నాబార్డు కూరగాయల మార్కెట్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మద్దికెర గ్రామంలో ఎన్నో ఏళ్లుగా చిరు వ్యాపారులు ఇరువైపుల వ్యాపారం చేసుకుంటూ దుమ్మూధూళికి ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. దాత మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి రూ.3లక్షలు విరాళంతో పాటు నాబార్డు నుంచి రూ.15 లక్షలతో కూరగాయల మార్కెట్ నిర్మించామని, అయితే రాష్ట్రంలోనే ఈ మార్కెట్ ఆదర్శంగా నిలిచిందన్నారు. మద్దికెర గ్రామంలో పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. డ్వాక్రా మహిళలు వ్యాపార సముదాయాలు నిర్మించుకోవడానికి కూడా డీఆర్‌డీఏకు నాబార్డు నిధుల ద్వారా రూ.3.50 కోట్లు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుబ్బారెడ్డి, సర్పంచ్ బండారు సుహాసిని, మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్ వి.నాగేశ్వరరెడ్డి ఉన్నారు.

వలస వెళ్లొద్దు.. పనులు కల్పిస్తాం

● డ్వామా పీడీ వెంకట రమణయ్య



తుగ్గలిలో సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ వెంకటరమణయ్య

తుగ్గలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ పనులు ముగిసిన అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పిస్తామని, వలసలు వెళ్లవద్దని పనులకు వెళ్లిన వారి పేర్లు మాత్రమే మస్టరులో ఉండాలని డ్వామా పీడీ వెంకట రమణయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని మారెళ్లలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు పరిశీలించి మస్టర్లను తనిఖీ చేశారు. అలాగే తుగ్గలిలో ఉపాధి సిబ్బంది తనిఖీ చేసి కూలీలతో మాట్లాడుతూ ప్రతి మేట్ పనుల వద్దే హాజరు వేసేలా ప్రతి కూలి హాజర్లు పనుల వద్దే వేయాలని, ప్రతి కూలీ మేటిని అడగాలన్నారు. అలాగే పనులకు రాని వారి పేర్లు మస్టరులో చేరిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అలాగే పాత పనులు చేసినా వాటికి బిల్లులు చెల్లించమన్నారు. రైతులకు ఉపయోగపడే పనులు మాత్రమే గుర్తించామని, ప్రతి పనికి పనులు ప్రారంభమయ్యే ముందు, ఆ తర్వాత ఫొటో తప్పనిసరిగా ఉండాలన్నారు. మారెళ్లలో దాదాపు వేయి మందికి పైగా పనులకు రావడం హర్షించదగ్గ విషయమని డేట్లు పూర్తయ్యే వరకు ప్రతి కూలీకి పనులు కల్పిస్తామని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేసిన కూలీకి ఒక రోజు రూ.300 వేతనం అందుతుందన్నారు. అనంతరం తుగ్గలిలో ఉపాధి సిబ్బందితో ఆయన మాట్లాడుతూ టీఏ, సీనియర్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లు వారి విధులను సక్రమంగా నిర్వర్తించాలని, ఎలాంటి అవినీతికి పాల్పడకూడదన్నారు. ఏవైనా ఫిర్యాదులు వస్తే వారిపై చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు. ఈయన వెంట ఎంపీడీవో విశ్వమోహన్, ఏపీడీ ఫక్కీరప్ప, ఏపీవో హేమసుందర్, తదితరులు ఉన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి

పత్తికొండ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్వతికొండ కాలనీలో విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహేబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు విద్యుత్ శాఖ అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక ట్రాన్స్‌కో ఏడీఈకి సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత 15 ఏళ్ల క్రితం పట్టణంలో నిరుపేదలకు పార్వతికొండ పరంబోకు పొలంలో పేదలకు గుడిసెలు వేయించడం జరిగిందని, ప్రస్తుతం వంద కుటుంబాల దాకా ఆ కాలనీలో నివాసం ఉంటున్నారన్నారు. అయితే ఈ కాలనీ విద్యుత్ స్తంభాలు లేక కట్టెలు ఏర్పాటు చేసుకుని ఇళ్లకు కరెంటు వైర్లను సప్లయ్ చేసుకున్నారని తెలిపారు. విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు తిమ్మయ్య, సహాయ కార్యదర్శి నాగేంద్ర, గిడ్డయ్యగౌడు, రవి, యూనుస్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేస్తా



సురేష్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఆదోని రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని మండిగిరి బీజేపీ ఇన్‌చార్జి కల్లుబోతుల సురేష్ తెలిపారు. మండిగిరి గ్రామ బీజేపీ ఇన్‌చార్జీగా నియమించిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటానని, పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, కూటమి నాయకులతో కలిసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందేలా కృషి చేస్తామన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు సురేష్‌తోపాటు బీజేపీ సీనియర్ నాయకులు వెల్లాల మధుసూదన్ శర్మ పూలమాలలు, శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వీరారెడ్డి, మురళీతోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త నిరసనను జయప్రదం చేయండి

పత్తికొండ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు మద్దతు ధర, ప్రైవేటీకరణ ఆపాలని నిరుద్యోగ, కార్మిక సమస్యలు పరిష్కరించాలని 26న గణతంత్ర వేడుకల రోజు తలపెట్టిన నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఈశ్వర్ రెడ్డి భవన్‌లో సీపీఎం, ప్రజా సంఘాల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చాక ఈ దేశంలో రైతులు, కర్షకులు, కార్మికులు నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కేంద్రం ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్నారని ఆరోపించారు. రైతులకు పంట గిట్టుబాటు ధర, కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. నిరసనను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గోపాల్, రమేష్, రంగస్వామి, కాశీనాథ్ పాల్గొన్నారు.

ప్రారంభమైన శావాసత ఉరుసు

తుగ్గలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శావాసత ఉరుసు ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమైంది. శుక్రవారం మండలంలోని చెన్నంపల్లిలో వెలిసిన శావాసత ఉరుసు ఉత్సవాల్లో భాగంగా గంధం వేడుకలను నిర్వహించారు. శనివారం ఉరుసు, ఆదివారం జియారత్ వేడుకలను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఉరుసుకు అనంతపురం, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారని తెలిపారు.

నేడు జాబ్‌మేళా

ఆదోని అగ్రిక్చర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల రహదారిలో ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (న్యాక్) శిక్షణ కేంద్రంలో నిరుద్యోగ యువతకు శనివారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి ఆనంద్ రాజ్‌కుమార్, న్యాక్ శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి ఉలుగన్న తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన నిరుద్యో యువతీ, యువకులు అర్హులన్నారు. తమ బయోడేటాతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్, జిరాక్స్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

డ్రైవింగ్ టెస్టులను ప్రైవేట్‌కు అప్పగించొద్దు



ఆలూరు అంబేడ్కర్ సర్కిల్లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ఆలూరు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం డ్రైవింగ్ టెస్టులు, వాహనాల ఫిట్నెస్‌లను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలూరు పట్టణంలో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీవో నెం.21ని రద్దు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేఖ విధానాల పై మార్చి 24న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

పత్తి పరిశ్రమలో ప్రమాదం దురదృష్టకరం



సంతోష్ పత్తి జిన్నింగ్ పరిశ్రమను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బసాపురం రోడ్డులో ఉన్న సంతోష్ పత్తి జిన్నింగ్ పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సంతోష్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమ అగ్ని ప్రమాదంలో పత్తి, దూది బేళ్లు, యంత్రాలు అగ్ని ప్రమాదంలో కాలిపోవడంతో పరిశ్రమను పరిశీలించి, యజమానితో మాట్లాడారు. పరిశ్రమ యజమాని ప్రశాంత్ మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిని చూసి, పరిశ్రమ అంతా అగ్ని ప్రమాదానికి గురై, తాను తీవ్రంగా నష్టపోయానని బోరున విలపిస్తూ, కన్నీటి పర్యంతమయ్యారు. ప్రశాంత్‌ను ఓదార్చి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఆదోనిలో ఇంత భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడం ఇదే మొదటిసారి అని, ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దాదాపుగా రూ.10 కోట్లు నష్టం జరిగిందన్నారు. నష్టపోయిన బాధిత పత్తి పరిశ్రమ యజమానికి ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి రావాల్సిన పరిహారం త్వరగా చెల్లిస్తే, రైతులకు చెల్లింపులు చేస్తారన్నారు. ప్రభుత్వం కూడా ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట కాటన్ మర్చంట్ అసోసియేషన్ సభ్యుడు నీలకంఠ, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ ఉన్నారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజాదర్బార్



అర్జీలను పరిశీలిస్తున్న కురుబ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప

ఆదోని, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ, కురుమ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాం నారాయణ రెడ్డి పాల్గొన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని దేవేంద్రప్ప తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నలమూలల నుండి పెద్ద ఎత్తున వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించామని తెలిపారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

వెల్దుర్తి, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీవో సుహాసినమ్మ అన్నారు. శుక్రవారం మండలంలో బింగిదొడ్డి గ్రామంలో రచ్చబండ వద్ద గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. జాబ్ కార్డు లేని వారందరూ జాబ్ కార్డులు పొందాలన్నారు. జాబ్ కార్డులున్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తామని ఎవరూ కూడా వలసలు వెళ్లొద్దని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మన్న, ఈవోఆర్డీ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి: ఆర్టీవో



ర్యాలీ నిర్వహిస్తున్న డ్రైవర్లు, ఆర్‌టీవో సిబ్బంది

గోనెగండ్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వాహన డ్రైవర్లు, ఖచ్చితంగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఆదోని ఆర్టీవో మహమ్మద్ అవిష్, గోనెగండ్ల సీఐ గంగాధర్ కోరారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా శుక్రవారం గోనెగండ్లలో సేఫ్టి డ్రైవర్ అసోసియేషన్ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ స్థానిక స్టేట్ బ్యాంక్ నుంచి నీలకంఠేశ్వర దేవాలయం వరకు సాగింది. ఆర్టీవో మహమ్మద్ అవిష్ మాట్లాడుతూ రోడ్డ భద్రతా నియమాలను ప్రతి డ్రైవర్ పాటించాలన్నారు. వాహనదారులు వాహన లైసెన్స్, యూనిఫామ్, ఇతర సంబంధిత పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అధికస్పీడ్, పరిమితికి మించి ప్రజలను వాహనాలలో ఎక్కించుకోరాదన్నారు. వాహనాలకు వైట్ లెడ్ లైట్లను వాడరాదని సూచించారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా డ్రైవర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు అన్వర్‌బాషా, సంఘంనాయకులు ఇసాక్, రాఘవేంద్ర, ఇజాజ్, మహమ్మద్, సుబ్రహ్మణ్యం, గోనెగండ్ల డ్రైవర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా గోనెగండ్ల మండల సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ కార్యవర్గం: మండల అధ్యక్షుడిగా బుట్టా ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా ఎస్. ఖాజాఖాద్రీ, కార్యదర్శిగా మస్తాన్‌వలి, సహాయ కార్యదర్శిగా వలి, కోశాధికారిగా మోషిన్, కార్యవర్గ సభ్యులుగా గజేంద్ర, చంద్రశేఖర్, సుంకన్న, ఉత్తేజ్, వలి, షేక్షావలిని ఎన్నుకున్నారు.

నేడు నిత్య పూజలకు విరామం

మంత్రాలయం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠంలో శనివారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరే గింపు, పరిమళ ప్రసాదం, టెంకాయ కొట్టడం బంద్ చేస్తారు. పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళహారతులు ఇస్తారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనానికి భక్తులు దర్శించుకొనే అవకాశం మాత్రమే కల్పించనున్నారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, పండితులు, అర్చకులు, శ్రీమఠం ఉద్యోగులు ఉపవాసంను పాటిస్తారు.

మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం

మంత్రాలయం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. శుక్రవారం దశమిని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి మహామంగళహారతులు ఇచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గోనెగండ్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పశువుల యజమానులు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి మహమ్మద్ ఆలీ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ఐరన్‌బండ, పుట్టపాశం గ్రామాలలో పశు వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆవులు, ఎద్దులు, గేదెలకు సామూహిక నట్టలనివారణ మందులు వేశారు. అలాగే గొర్రెలు, మేకలు, పెంపకదారులకు నులి పురుగుల మందులను పంపిణీ చేశారు. గొడ్డు మోత ఉన్న పశువులకు, గర్భకోశానికి సంబంధించిన వ్యాధి ఉన్న పశువులకు చికిత్స చేశారు. 30 పశువులకు చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వీరేష్, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ హత్య దారుణం

మంత్రాలయం జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలంలోని అరికేర గ్రామంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను హత్య చేయడం దారుణమైన సంఘటన అని బీఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షులు రామతీర్థం అమ్రేష్ అన్నారు. శుక్రవారం బూదూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న ఉద్యోగులపై ఇలాంటి హత్యలు, దాడులు, రాజకీయ బెదిరింపులు చేస్తే ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులు మనశాంతిగా పని చేయలేరన్నారు. హత్యకు పాల్పడిన నిందితులను గుర్తించి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ద్విచక్ర వాహనంలోకి దూరిన పాము

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంలోకి పాము దూరింది. శుక్రవారం వ్యవసాయ కార్యాలయం ముందు ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి పని నిమిత్తం కార్యాలయంలోకి వెళ్లాడు. అంతలోపే చెట్టుపై నుంచి కింద పడిన పాము పిల్ల ద్విచక్రవాహనంలోని సీటు కిందకు వెళ్లింది. దీన్ని గమనించిన స్థానికులు ద్విచక్రవాహనదారుడికి తెలపడంతో స్థానికుల సహాయంతో ద్విచక్ర వాహనంలో దూరిన పాముపిల్లను బయటకు తీసి చంపివేశారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన మతి స్థిమితం లేని వ్యక్తి

పెద్దకుబూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మతి స్థిమితం లేని వ్యక్తి బావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కల్లుకుంట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలో మూడు రోజుల నుంచి మతి స్థిమితం లేని వ్యక్తి తిరుగుతున్నాడన్నారు. నీరు తాగేందుకని బావిలోకి దిగి ఎంత సేపటికి రాకపోవటంతో పొలాల్లో పని చేసే కూలీలు గమనించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న గ్రామస్థులు బావిలో పడిన వ్యక్తిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. గ్రామ పంచాయతీ సిబ్బంది ఖననం చేశారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి

గోనెగండ్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని మేజర్ సర్పంచ్ హైమావతి, బేతాలబడేసా, రామాంజినేయులు, తిరుపతయ్యనాయుడు అన్నారు. శుక్రవారం కురువ పేటలో రూ. 20 లక్షల పంచాయతీ నిధులతో రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయన్నారు. ఇప్పటికి మూడు కోట్లు రూపాయలతో మండలంలో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులు ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీ కార్యదర్శి సతీష్, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, శ్రీధర్, బీజేపీనాయకుడు మునిస్వామి, జానీ, బాబునాయుడు, మేకల మునెప్ప, హరికృష్ణ పాల్గొన్నారు.

కోసిగి ఏపీవోగా మాధవశంకర్

కోసిగి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కోసిగి మండల ఏపీవోగా మాధవ శంకర్ శుక్రవారం నూతన బాధ్యతలు చేపట్టారు. ఈయనతో పాటు ఈసీగా కాలిక్ బాధ్యతలు స్వీకరించారు. ఏపీవో మాధవశంకర్, ఈసీ కాలిక్‌లు కోసిగి, చింతకుంట, పల్లెపాడు గ్రామాల్లో మినీ గోకులం షెడ్ల పనులను పరిశీలించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



పెద్దకడబూరులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



నందవరంలో..

పెద్దకడబూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, దీనిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తహసీల్దారు శ్రీనాథ్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటర్లుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నందవరం: 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని తహసీల్దారు శ్రీనివాసులు, ఎస్‌ఐ శ్రీనివాసులు, డీటీలు సతీష్, మహేష్ , ఈవోపీఆర్డీ సందీప్‌లు సిబ్బంది, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. వీఆర్వోలు, సర్వేయర్లు, ప్రజలు పాల్గొన్నారు.



కోసిగిలో..

కోసిగి: మండల కేంద్రమైన కోసిగిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వం చేపట్టిన ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి తహసీల్దార్ రుద్రగౌడు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీరాములు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓటర్ల దినోత్సవంపై ర్యాలీ

మంత్రాలయం: నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో శనివారం ఓటర్ల దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జీకే గురురాజరావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో, కాలేజీల్లో వక్తృత్వ పోటీలు నిర్వహించామని, ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయడం, పాఠశాలలో, కళాశాలల్లోనే ఓటర్ల ప్రతిజ్ఞ చేయించాలని ఎంఈవోలు మైనుద్దీన్, రాగన్న, హెచ్‌ఎంలను ఆదేశించామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మంత్రాలయం రాఘవేంద్రసర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, సర్కిల్‌లో ప్రతిజ్ఞ చేసి ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో డీటీ సరస్వతి, జయరామిరెడ్డి, ఆర్‌ఐ ఆదాం, వీఆర్వోలు భీముడు, భీమన్నగౌడు, ఆనంద్, ప్రభాకర్, రాజు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం గొప్పది



పార్లపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో రాజ్యాంగంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మహేష్, మనోజ్, ఉదయ్‌లు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే భారతదేశానికి దిక్సూచి అని టీడీపీ నాయకులు దళిత రచయిత సంఘం అధ్యక్షుడు కదిరికోట ఆదెన్న అన్నారు. జనవరి 26న 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని దళిత రచయిత సంఘం రూపొందించిన 75 ఏళ్ల రాజ్యాంగ వజ్రోత్సవాల క్యాలెండర్‌ను శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాలకు, అధికారులకు అందజేశారు. ఇందులో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందికి ఎంపీడీవో బంగారమ్మ అందజేశారు.

వాహనాల తనిఖీ

మంత్రాలయం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిబంధనలు అతిక్రమించి ప్రమాదాలకు కారణమైతే.. కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధిస్తామని ఆదోని ఆర్టీవో మహ్మద్ అవీస్ హెచ్చరించారు. శుక్రవారం మంత్రాలయం, మాధవరం తదితర ప్రాంతాల్లో కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనాలకు అపరాధ రుసుం విధించారు. రోడ్డు నిబంధనలతో పాటు డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, పర్మిట్ ఉండాలన్నారు.

మద్దతు ధర కల్పించాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు పంపన్నగౌడు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన అన్ని రకాల పంటలకు మద్దతు ధర కల్పించాలని ఏఐకేఎస్, ఐఎఫ్‌టీయు, ఏఐటీయూ నాయకులు పంపన్నగౌడు, ప్రసాద్, వీరేష్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కార్యకర్తల ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఏ మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రైతులకు మాత్రం న్యాయం జరగడంలేదన్నారు. గ్రామాల్లో ఉపాధి పనులు లేక ఎంతో మంది వలసలు వెళ్తున్నా ఎందుకు ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. రైతులు, కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న చేపట్టే నిరసన కార్యక్రమాన్ని అందరు జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో జబ్బార్, రంగన్న, భాస్కర్‌యాదవ్, సుందర్‌రాజు, సమీఉల్లా, దాదావలి, విజయేంద్ర, మల్లికార్జున, నరసింహులు, బాషా, గురు పాల్గొన్నారు.

కక్ష సాధింపు రాజకీయాలు సరికాదు



మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కక్ష సాధింపు రాజకీయాలు చేయడం సరికాదని వైసీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో విలేకరులు సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్, వైసీపీ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగేశప్ప, ఎంపీపీ కేశన్న మాట్లాడుతూ ఎస్‌డీపీవో కార్యాలయం నుంచి మీపై కేసు నమోదు అయిందని విచారణకు హాజరు కావాలని చెప్పారన్నారు. కేసు వివరాలు అడగగా డిసెంబరు 16న సోమప్ప సర్కిల్‌లో ధర్నా సమయంలో పట్టణ ఎస్‌ఐను దూషించడం, విధులకు ఆటంకం కలిగించడం వలన కేసు నమోదు చేశామని చెప్పారన్నారు. ఇలాంటి బెదిరింపుల కేసులకు వెనక్కి తగ్గమన్నారు. సమావేశంలో నందవరం మండలం కన్వీనర్ శివప్ప గౌడ్, యుకే రాజశేఖర్, విరుపాక్షిరెడ్డి, నబి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు కోసం రేపు ర్యాలీ

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ ఈనెల 26న నిర్వహించనున్న నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు లక్ష్మీ నరసయ్య కోరారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక సుందరయ్య భవన్‌లో రైతు, కార్మిక సంఘాల ఎమ్మిగనూరు సమన్వయ కమిటీ సమావేశం రైతు సంఘం నాయకుడు సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు లక్ష్మీ నరసయ్య, రైతు సంఘం మండల అధ్యక్షుడు అబ్దుల్లా, సీఐటీయూ పట్టణ కార్యదర్శి రాముడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన వాగ్దానాలను గాలికి వదిలేసిందన్నారు. కార్యక్రమంలో రాజు, కుదుసు, నరసన్న, మల్లేష్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

నందవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందవరంలోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం కంటి వైద్య శిబిరం ఆర్కే కంటి వైద్యశాల వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ హేమంత్‌కుమార్ ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. పజలకు సేవ చేయాలనే దృక్పథంతో ఈ కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ తెలిపారు.

వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలి



మాట్లాడుతున్న నాగరాజు

గోనెగండ్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని లేక పోతే తీవ్రపరిణామాలు ఎదుర్కొవలసి వస్తుందని టీఎన్‌ఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు, పెద్దమరివీడు టీడీపీ నాయకులు ప్రభుదాసు, రాముడు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ బీవీ జయనాగేశ్వరరెడ్డిని విమర్శించే స్థాయి ఎమ్మిగనూరు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహ్మద్‌కు లేదన్నారు. స్థాయిని మించి మాట్లాడటం సరికాదన్నారు. విమర్శించే ధోరణిని మానుకోవాలని లేకపోతే ప్రజలే మీకు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో గోపాల్, హనుమంతు, లింగన్న, కృష్ణ పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన మంత్రాలయం



శ్రీమఠం ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు

మంత్రాలయం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడిగా మారింది. శుక్రవారం దశమి కావటంతో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అన్నపూర్ణ భోజనశాల, మహా ముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొన్న మఠం అధికారులు క్యూలైన్లు,పరిమళ ప్రసాదం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు: రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై విహరించారు. శుక్రవారం పుష్యమాసం దశమి శుభదినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనానికి క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేసి వెండి, బంగారు, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. పూర్ణబోధ పూజ మందిరంలో మూలరాములకు, జయరాములు, దిగ్విజయరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

బీవీపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

గోనెగండ్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డిపై అసత్య ఆరోపణలు మానుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ గాజులదిన్నె కురువ హనుమంతు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కొందరు బీవీపై అసత్య ఆరోపణలను ప్రచారం చేస్తున్నారని, నామినేటెడ్ పదవులకు డబ్బులు తీసుకుంటున్నట్లు కొన్ని సామాజిక మాధ్యమాలలో రావడం బాధాకరమన్నారు. కొంతమంది ఎమ్మెల్యే బీవీ ఎదుగుదలను, ప్రజలలో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక ఇలాంటి ఆధారాలు లేని అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సీనియార్టీకి అవకాశాలు తప్పక వస్తాయన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కురువలకు ఇస్తామని ఎమ్మెల్యే బీవీ గతంలోనే ప్రకటించారని అన్నారు. ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు మానుకోవాలని సూచించారు.

క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలి



బహుమతులు అందజేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ

నందవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలని టీడీపీ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ రఘుమూర్తి స్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని కనకవీడు గ్రామంలో దస్తగిరయ్యస్వామి ఉరుసు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ పోటీల్లో గెలుపొందిన మొదటి జట్టుకు రూ10,016, రెండవ జట్టుకు రూ.5,016లను టీడీపీ నాయకులు రఘుమూర్తిస్వామి అందజేశారు. అలాగే క్రికెట్ టీంలో గెలుపొందిన మొదటి జట్టుకు రూ.10,016ను కాటన్‌మిల్ ఓనర్ నటరాజ్, రెండవ జట్టుకు రూ.5,016ను కురవ చంద్రశేఖర్ అందజేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

నందవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందవరంలో అభివృద్ధి పనులను ఎంపీడీవో పుల్లయ్య శుక్రవారం పరిశీలించారు. నందవరంలో జలజీవన్ పనులను తనిఖీ చేశారు. పనులు జరిగిన తీరును ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యానారాయణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. పంచాయతీ కార్యాలయంలో హాజరు పట్టికను పరిశీలించారు. సమయ పాలన తప్పని సరిగా పాటించాలన్నారు. ఆలస్యంగా వచ్చిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

బాలికలను ప్రోత్సహించాలి



విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న డాక్టర్ మౌనిక

కోసిగి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాల్లో ముందుండేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని డాక్టర్ మౌనిక అన్నారు. శుక్రవారం కోసిగిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు శంకరయ్య, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణ కుమారి, వైద్యసిబ్బంది కోటేశ్వరమ్మ, ఈశ్వరమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రీసర్వే పనులు పకడ్బందీగా చేపట్టాలి



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

గోనెగండ్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో చేపట్టిన రీసర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. గోనెగండ్ల మండలం రీ సర్వే పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నికైనందున శుక్రవారం రీసర్వేకు సంబంధించిన అంశాలపై ఆయన అధికారులతో చర్చించారు. గ్రామంలోని రీసర్వే జరుగుతున్న పొలాల దగ్గరకు వెళ్లి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండి సర్వే పనులకు సహకరించాలని కోరారు. నిర్దేశించిన సమయానికి సర్వే పనుల పూర్తి చేయాలని సర్వే సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుమారస్వామి, శిరీష, అబ్దుల్‌హమీద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పిస్తున్నాం

గోనెగండ్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి పనులు కల్పిస్తున్నాము కూలీలు తప్పని సరిగా పనులకు హాజరు కావాలని ఎంపీడీవో మణిమంజరి కోరారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'మూటముల్లె సర్దుకున్న పల్లె' అన్నశీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. సాయంత్రం ఐరన్ బండ ఎస్సీ కాలనీలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. వలసలు వెళ్లితే అక్కడ జరిగే ఇబ్బందులను గురించి కూలీలకు వివరించారు. అక్కడ వచ్చే కూలి డబ్బులే ఇక్కడ కూడా వస్తాయని వలసల వల్ల మీపిల్లల చదవు దెబ్బతింటుందని, మీ పిల్లల భవిష్యత్ కోసమైనా ఆలోచించాలని కోరారు. అలాగే గ్రామాలలో ఉపాధిపనులు చేస్తే రోజుకు రూ. 300 కూలి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరసన్న, ఈవోఆర్‌డీ అనంతశయన, ఏపీవో మహమ్మద్ బాషా, నజీర్, సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి మోడల్ పేపర్ల ఆవిష్కరణ

కోసిగి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ రూపొందించిన ఎస్‌ఎస్‌సీ మోడల్ పేపర్లను శుక్రవారం కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ సంఘం మండల కార్యదర్శి లక్ష్మన్న ఆధ్వర్యంలో విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న సీఐ గంగాధర్

గోనెగండ్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాలలో రాణించాలని గోనెగండ్ల సీఐ గంగాధర్ కోరారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని కున్నూరు గ్రామంలో కమ్యూనిటీ డెవలప్ మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాలలో బాలికలతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ బాలికల పురోభివృద్ధికి ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని ముందుకు రావాలని కోరారు. అనంతరం చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులు సీఐ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డెవలప్‌మెంట్ సొసైటీ శ్రీనివాసరావు, హెచ్‌ఎం పరమేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, మద్దయ్య, పాఠశాల చైర్మన్ వెంకటరాముడు, పీఎస్ లక్ష్మీరత్నమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.